

పాదాల మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



మెట్లమార్గంలో...



కిక్కిరిసిన అలిపిరి పాదాల మండపం

పెరటాసి మాసం రెండో శనివారం సందర్భంగా అలిపిరి శ్రీవారి పాదాల మండపం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో బియ్యపుపిండితో ముగ్గులు వేసి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వెళ్లే భక్తులు పాదాల మండపం వద్ద కర్పూర హారతులు తీసి కన్పించారు. మెట్ల మార్గంలో తమిళనాడు ముఖ్యమైన పెరటాసి మాసం సందర్భంగా రద్దీ నెలకొంది. భక్తులు శ్రీవారి పాదుకలు తలపై ఉంచుకుని ప్రదక్షిణలు చేస్తూ కన్పించారు. -ఈనాడు, తిరుపతి

అవిశ్రాంత సాధకులు ఏడు పదుల వయసులోనూ హుషారుగా ఈత

ఈదేస్తాం.. అనారోగ్యాన్ని జయిస్తాం

70 ఏళ్లు దాటగానే వృద్ధాప్యంతో నడవడానికే ఇబ్బంది పడుతుంటారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతుంటారు. కానీ వీరు మాత్రం ఏడు పదుల వయసులోనూ.. ఎంతో హుషారుగా ఈత కొడుతూ ఆశ్చర్యపరుస్తున్నారు. బద్ధకాన్ని వదిలించుకుని ఆరోగ్యకర జీవనం కోసం ఏదో ఒక వ్యాయామాన్ని అలవాటు చేసుకుని నిత్యం సాధన చేయాలని సూచిస్తున్నారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు తిరుపతికి చెందిన ప్రయాగ సుబ్రహ్మణ్యం, అరుణ దంపతులు, భూపాల్ నాయుడు. - న్యూస్‌టుడే, తిరుపతి(క్రీడలు)



రోగనిరోధక శక్తి పెంపు

2010లో నేను ఈత సాధన మొదలు పెట్టా. ఉపశమనంతో పాటు శరీరానికి సంపూర్ణమైన వ్యాయామం దొరుకుతుంది. రోజూ గంట పాటు ఈత కొట్టడంతో రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అంతే కాకుండా కీళ్లు, కండరాలు, నరాలు బలపడి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈతకొలనులో అన్ని వయసుల వారు ఉండటంతో స్నేహపూర్వక బంధం ఏర్పడుతోంది. - ప్రయాగ సుబ్రహ్మణ్యం (72), ఆర్బీఐ విశ్రాంత జీఎం

ఎన్నో ప్రయోజనాలు

గత 18 ఏళ్లుగా నేను ఈత సాధన చేస్తున్నా. నేలపై చేసే వ్యాయామం కంటే నీటిలో ఈత వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నీటిలో కాసేపు ఉంటేనే శరీరంలో 300 కేలరీలు కరుగుతాయి. అంటువ్యాధిని అరికట్టడానికి ఈత కొడితే అనారోగ్యాలు దూరమవుతాయి.



- డాక్టర్ అరుణ (ప్రయాగ)(68), పెథాలజీ ప్రొఫెసర్

22 ఏళ్లుగా సాధన



నేను 22 ఏళ్లుగా ఈత సాధన చేస్తున్నా. మనం వాడే వాహనాలకు సర్వీసు ఎంత అవసరమో, మన శరీరానికి కూడా వ్యాయామం అంతే అవసరం. రోజూ సాధన చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటా. ఒక్కరోజు సాధన చేయక పోయినా ఏదో తెలియని వెలితిగా ఉంటుంది. నీటిలో వ్యాయామం చేయడం ద్వారా కీళ్లు, కండరాలపై ఒత్తిడి ప్రభావం ఉండదు. - పి.భూపాల్ నాయుడు(76), వ్యాపారవేత్త

ఆదివారం ప్రత్యేకం

ఈ-కామర్స్‌లో సరికొత్త లికిత్‌ం

ఈనాడు డిజిటల్, తిరుపతి: కిరాణా దుకాణాలకు బాసటగా నిలిచి.. నిత్యావసరాలను ప్రజలకు అందించేందుకు 'ట్రెండెల్' అనే యాప్ తయారు చేశారు తిరుపతికి చెందిన యువకుడు. కేవలం 21 ఏళ్లకే యువ పారిశ్రామికవేత్తగా మారిన కేపీఎన్ లికిత్ కుమార్ కథేంటో తెలుసుకుందాం.

- చిన్న దుకాణాలకు బాసటగా.. యాప్ ఆవిష్కరణ
- 21 ఏళ్లకే యువ పారిశ్రామికవేత్తగా ప్రయాణం

డిగ్రీ మొదటి ఏడాదిలో ఉన్నప్పుడే మిత్రులతో కలిసి పోషకాహారాన్ని అందించాలనే లక్ష్యంతో 'ఫ్యూజన్ హెల్త్ కేఫ్' ప్రారంభించారు. రూ.2 వేల అద్దెతో, రూ.12 వేల పెట్టుబడితో మొదలు పెట్టి ప్రచారం చేశారు. కేవలం రెండు నెలల్లోనే రూ.1.3 లక్షల సంపాదన పెరిగింది. మరోవైపు, డిగ్రీ పూర్తి చేశారు. కొంతకాలం తరువాత తెలిసిన వాళ్లకు కేఫ్ అప్పగించి, నూతన ఆవిష్కరణలు చేయాలనుకున్నారు. కిరాణా దుకాణాల కోసం ఏదైనా యాప్ చేయాలనుకున్నారు. బెంగళూరులోని యాప్ డెవలప్ కంపెనీలో చేరారు. పూర్తి అవగాహన పెంచుకుని, 4 నెలలకే ఉద్యోగం వదిలేసి ఇంటిబాట పట్టారు.

ఒక్కసారిగా కుప్పకూలిపోయింది

అంతా బాగుందనుకున్న సమయంలో యాప్ సామర్థ్యం తట్టుకోక 2024 జనవరి చివర్లో క్రాష్ అయింది. సేవలు నిలిచిపోవడంతో వినియోగదారుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయి. యాప్ గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిన తిరుపతి ఐఐటీ విద్యార్థులు పలువురు లికిత్‌ను సంప్రదించారు. ఉచితంగా యాప్‌ను డెవలప్ చేశారు.



సిబ్బందితో లికిత్

2021 ఆగస్టు నుంచి ట్రెండెల్ యాప్ ఆవిష్కరణలో నిమగ్నమయ్యారు. 2023 అక్టోబరులో పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ప్రారంభంలో ప్రతి దుకాణానికి వెళ్లి దాని గురించి వివరించి చెప్పారు.. వాళ్లు డౌన్‌లోడ్ చేసుకుని సబ్‌స్క్రిప్షన్ తీసుకునేలా ఒప్పించేవారు. రోజుకు మహా అయితే 20 వరకు డౌన్‌లోడ్ అయ్యేవి. అయినా నిరాశ చెందకుండా లికిత్ తన ప్రయత్నాలు ఆపలేదు. అలా ఒక్కరోజుకు 270 డౌన్‌లోడ్స్ వరకు తీసుకెళ్లారు. 2024 జనవరి వరకు తిరుపతి నగరవ్యాప్తంగా 4600 మంది సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు.

ప్రతి దుకాణానికి వెళ్లి..

ప్రస్తుతం ఇలా..

యాప్‌ను ప్రస్తుతం 50 వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో ఆర్డర్ పెట్టిన 30 నిమిషాల్లోనే వస్తువు దుకాణదారు నుంచి ఇంటికి చేరుతుంది. ఆన్‌లైన్‌లో లభించే వస్తువులన్నీ తిరుపతి స్థానిక దుకాణాల్లో దొరుకుతుంటాయి. దాదాపు 8 మందికి ఉపాధి కల్పించారు లికిత్. ఇప్పటివరకు తిరుపతిలోనే ఉన్న ట్రెండెల్‌ను హైదరాబాద్‌కు కూడా పరిచయం చేయాలని కృషి చేస్తున్నారు.

అప్పలాయగుంటలో పవిత్రోత్సవాలు ప్రారంభం



వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాల్లో మొదటి రోజు యాగశాలలో హోమాన్ని నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తులు, అనుబంధ ఆలయాలల్లో అర్చకులు పవిత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయాధికారి శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచార్యులు పాల్గొన్నారు.

మెప్మా అవినీతి నిగ్గు తేల్చే నాథుడేరి!

వైకాపా అనుకూలురకు అందలం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా మెప్మాలో ఐదేళ్లుగా దోపిడీ చేసినట్లు అవినీతి బాగోతాలు బయటపడుతున్నా వారిని కొనసాగించేందుకు ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు చేయడం చర్చనీయాంశమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల జాబితాలో సైతం వైకాపా నేతలకు అనుకూలంగా వ్యవహరించిన అనేక మందికి స్థానచలనం కలగకపోవడం గమనార్హం.

తిరుపతి నగరపాలక పరిధిలోని మెప్మా మహిళా సంఘాల ఆలనాపాలనా ఐదేళ్లుగా పూర్తిగా విస్మరించారు. అధికార పార్టీ కార్యకర్తల్లా మారిన కొందరు ఉద్యోగులు అడుగడుగునా మెప్మాను వైకాపా నేతలకు దాసోహం చేశారు. వారి మాటను శాసనంగా అమలుచేశారు. మహిళా సంఘాల సభ్యుల సొమ్మును మేసిన కొందరు ఆర్పీలకు ఉన్నతాధికారులే ఐదేళ్ల పాటు అండగా నిలిచారు. బోగస్ మహిళా సంఘాలు, ఆర్పీలు మహిళా సంఘాల సభ్యుల పొదుపు సొమ్మును పక్కదారి పట్టించిన వైనం, ఒకే సంఘానికి రెండు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి కాజేయడం, సభ్యులకు తెలియకుండానే రూ.కోట్లు బ్యాంకు లింకేజీ జాబితాలో మళ్లించడం, సమాఖ్యల ఖాతా నిల్వల్ని ఖాళీ చేసి పేద మహిళల శ్రమను దోచుకున్న ఘటనలు తిరుపతిలో అనేకం వెలుగు చూస్తున్నాయి. వీటిని మెప్మా అధికారులు గుర్తించినా కార్పొరేటర్ స్థాయి నేతల నుంచి వైకాపాలో పైస్థాయి నేతల వరకూ మౌఖిక ఆదేశాలతో విచారణకు నోచుకోకుండా చేశారు. ఆర్పీలు కొందరు అతీతశక్తులుగా మారి పథక సంచాలకుల్ని సైతం ప్రభావితం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఐదేళ్లుగా మహిళా సంఘాల ఖాతాల్ని ఆడిటింగ్‌కు నోచుకోకుండా చేశారు. అదే జరిగితే వారి ఆగడాలు వెల్లడై పేద మహిళల సొమ్ము లెక్కలు వెలుగు చూస్తాయి. ఇన్నాళ్లు బహిరంగంగా వైకాపా జెండాతో హల్‌చల్ చేసిన కొందరు ఆర్పీలు, ఉద్యోగులు ఇప్పుడు ప్లేటు ఫిరాయించి రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని నిక్కచ్చిగా పనిచేసే అధికారులు తమకొద్దంటూ విన్నవిస్తున్నారు.

వీడియోలు హల్‌చల్

తిరుపతిలో 20 మందికి పైగా ఆర్పీలు బహిరంగంగా వైకాపా సేవలో తరించారు. వీరిలో కొందరి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. గతంలో తిరుపతి వైకాపా అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ఆత్మీయ సమావేశాలు, సభలకు జనసమీకరణ చేసిన కొందరు ఆర్పీలు, మెప్మా ఉద్యోగులపై వందల సంఖ్యలో ఫిర్యాదులున్నా.. వారిని తిరుపతిలోనే కొనసాగించేందుకు ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు చేయడం గమనార్హం.

ఆడిటింగ్ ప్రారంభమైంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహిళా సంఘాల ఆడిటింగ్ కుప్పంలో ఇటీవలే ప్రారంభమైంది. మెప్మా, సెర్ప్ సమన్వయంతో థర్డ్ పార్టీ ఆడిటింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మెప్మా సంఘాల ఆడిటింగ్ జరిగి తీరుతుంది. అన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయి. తప్పు చేసిన ఎవరూ తప్పించుకునే అవకాశం లేదు. - రాధమ్మ, మెప్మా పీడీ

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శనివారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. శుక్రవారం శ్రీవారిని 64,158 మంది దర్శించుకున్నారు. రూ.3.31 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది. ● తిరుమలలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. శ్రీవారిని దర్శించుకుని బయటకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు.

సర్వదర్శనానికి 15 గంటలు



శ్రీవారి ఆలయం వద్ద వర్షంలో భక్తులు

ఉత్సాహంగా యువజనోత్సవాలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: వివేకానందస్వామి జయంతి పురస్కరించుకుని ఏటా నిర్వహించే యవజనోత్సవాల్లో భాగంగా జిల్లా యువజనోత్సవాలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల వేదికగా సెట్విన్ సీఈవో డా.మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, డీఈవో శేఖర్, సంగీత కళాశాల అధికారిణి ఉమా విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక పోటీలలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి 125 మంది యువతీయువకులు హాజరై ప్రతిభను కనబరిచారు.



యువత బృంద నృత్య ప్రదర్శన

క్రీడల్లో అవినీతిని బట్టబయలు చేస్తాం

శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో క్రీడల శాఖలో జరిగిన అవినీతిని బట్టబయలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ రవినాయుడు అన్నారు. శాప్ ఛైర్మన్ హోదాలో శనివారం మొదటిసారి తిరుపతి వచ్చిన ఆయనకు తెదేపా, జనసేన, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో రవినాయుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో శాప్ ఛైర్మన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటానన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



రవినాయుడుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నేతలు

డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సిందే



అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద పూజలు చేస్తున్న సాధువులు, స్వామీజీలు

స్వామీజీల డిమాండ్

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ సీఎం జగన్ రాక్షస ప్రభుత్వం అనడాన్ని స్వామీజీలు, సాధువులు, హిందూ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. జగన్ ఎప్పుడు తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలన్నా డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సిందేనని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి పేర్కొన్నారు. శనివారం సాధువులు, స్వామీజీలు, హిందూ సంఘాల నేతలతో కలిసి ఆయన అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద పూజలు చేశారు. జగన్ తిరుమల రాకపోవడం శుభపరిణామం అని.. అలాంటి వ్యక్తి రాకపోవడంతో ప్రజలందరికీ మేలు జరిగిందని శ్రీనివాసనంద సరస్వతి అన్నారు. జగన్ తాను క్రిస్టియన్ అని అంగీకరించారని, తన చేతిలో బైబిల్ ఎల్లవేళలా ఉంటుందని ప్రకటించారని.. మరి జగన్ పేరులో రెడ్డి అనే పదం కూడా తొలగించుకుంటే మంచిదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రాక్షస రాజ్యం అనడంలో అర్థం లేదని.. జగన్ ప్రభుత్వంలోనే రాక్షసులు, మారీచులు, దోపిడీదారులు, ఆక్రమణదారులు ప్రజలను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారన్నారు. రాక్షస సైన్యాన్ని జగన్ ప్రభుత్వం పెంచి పోషించిందని విమర్శించారు.



అక్రమ తవ్వకాలు జరిపిన ప్రదేశం

అంజేరమ్మ కనుమలో.. అక్రమ తవ్వకాలు

వడమాలపేట, న్యూస్‌టుడే: వడమాలపేట సమీపంలోని అంజేరమ్మ కనుమలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు వెంచర్లు రావడంతో గ్రావెల్‌కు డిమాండ్ నెలకొంది. ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది.

అంజేరమ్మ కనుమతో పాటు పూడి, కాయం ప్రాంతాల నుంచి ఎక్కువగా గ్రావెల్ తరలింపులు జోరుగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా అంజేరమ్మ కనుమలో భారీ యంత్రాల సాయంతో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతుండటంతో సమీపం గ్రామ ప్రజలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి వరకు మిన్నకున్న మండల అధికారులు జిల్లా అధికారుల ఆదేశాలతో అంజేరమ్మ కనుమకు పరుగు పరుగున వెళ్లారు. మండల తహసీల్దార్ జరీనా అక్రమ తవ్వకాలు జరుపుతున్న యంత్రాలను స్వాధీనం చేసుకోకుండా అక్కడ నుంచి పంపేయడం గమనార్హం.

హుటాహుటిన అనుమతులు..

అక్రమ తవ్వకాలకు పాల్పడిన ఓ వెంచర్ యాజమాన్యం మైనింగ్ అధికారుల నుంచి శనివారం సాయంత్రం హుటాహుటిన అనుమతులు పొందడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు అందాయన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో శ్రీధర్, జేఈవో వీరబ్రహ్మం తదితరులతో కలిసి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

స్విమ్స్ పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యవిభాగం): స్విమ్స్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ(పారా మెడికల్) కోర్సులకు మూడో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్లా తెలిపారు. అక్టోబరు 2 నుంచి 3వ తేదీ వరకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన లింకు ద్వారా కోర్సుల ఎంపిక చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో భారీగా వీఆర్వోల బదిలీ

తిరుపతి (కలెక్టరేట్): జిల్లాలో భారీ ఎత్తున వీఆర్వోలను బదిలీ చేస్తూ శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-3 పరిధిలో 71 మంది, జోన్-4 పరిధిలో 171 మంది బదిలీ అయ్యారు. రాజకీయ సిఫార్సుల ఆధారంగా వీఆర్వోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. గతంలో వైకాపా నాయకులతో అంటకాగిన అనేక మంది వీఆర్వోలు బదిలీల్లో తమకు కావాల్సిన స్థానాల్లో పోస్టింగ్ దక్కించుకోవడం గమనార్హం.

రెవెన్యూలో ఏదీ ప్రక్షాళన!

- మళ్లీ వారే ఇన్‌ఛార్జి తహసీల్దార్లు
- వైకాపాతో సత్సంబంధాలే అర్హత

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వాళ్లు డిప్యూటీ తహసీల్దార్లు. వైకాపా ప్రభుత్వంలో తహసీల్దార్లుగా ఏళ్ల తరబడి చలామణి అయ్యారు. ఆ పార్టీ నేతలతో అంటకాగారు. దానినే అర్హతగా తీసుకుని వారిని అదే స్థానాల్లో ఇన్‌ఛార్జి తహసీల్దార్లుగా కొనసాగిస్తున్నారు.

ఎన్నికల తర్వాత పొరుగు జిల్లాల నుంచి తహసీల్దార్లు వచ్చిన అనంతరం గత నెలలో బదిలీలు చేపట్టారు. ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్నవారికి కీలక మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు. గతంలో పనిచేసిన మండలాల్లో తహసీల్దార్లుగా నియమించవద్దని వేడుకున్నా వినలేదు. కారణం అక్కడి డీటీలను ఇన్‌ఛార్జి తహసీలార్లుగా కొనసాగించేందుకే. ఈ బదిలీలపై ఎన్నిసార్లు గగ్గోలు పెట్టినా.. కలెక్టరేట్ అధికారులు పథకం ప్రకారమే అంతా చేసేశారు. పలుచోట్ల ఉన్నతాధికారులు అనుకున్న వారినే ఇన్‌ఛార్జి తహసీల్దార్లుగా కొనసాగిస్తున్నారు. వీరంతా వైకాపా ప్రభుత్వంలోనూ ఇన్‌ఛార్జులుగా పనిచేశారు.

ఇవిగో రుజువులు

- ❖ వెంకటగిరి తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ రాంబాబుకు ఇన్‌ఛార్జి(ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు.
- ❖ చిల్లకూరు తహసీల్దార్‌గా కె.రవికుమార్‌ను నియమించారు. ఆ మండలంలో పనిచేశానని, మళ్లీ నియమించవద్దంటూ వేడుకున్నా అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. దాంతో ఆయన సెలవు పెట్టాక సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా నియమించారు. చిల్లకూరులో అక్కడి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు ఇన్‌ఛార్జిగా(ఎఫ్ఏసీ) నియమించారు. వైకాపా ప్రభుత్వంలో ఎన్నికల వరకు ఆయనే అక్కడ ఇన్‌ఛార్జి తహసీల్దార్.
- ❖ గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా శిరీషాను నియమించారు. రాజకీయ ఒత్తిడితో ఆమెను అక్కడి నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. కానీ డిప్యుటేషన్‌పై గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా విధులు అప్పగించారు.
- ❖ వెంకటగిరి, చిల్లకూరు, తడ ఇన్‌ఛార్జి తహసీల్దార్లపై వివిధ కేసుల్లో ఆరోపణలున్నా అందలం ఎక్కించారు.

తడ విషయానికి వస్తే..

రాష్ట్ర సరిహద్దులో తడ మండలం ఉంది. ఎంతో కీలమైన ఈ మండలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు బి.పద్మావతిని తహసీల్దార్‌గా నియమించారు. అయితే ఆమె విధుల్లో చేరే రోజే కలెక్టరేట్ నుంచి చేరవద్దంటూ హుకుం జారీ చేశారు. చేసేదిలేక ఆమె వెనక్కు వెళ్లారు. కానీ ఆమెకు తడ తహసీల్దార్‌గా పోస్టింగ్ చూపి, కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు. తడలో డీటీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దాంతో ఇక్కడ పాలన గాడి తప్పింది. ఇన్‌ఛార్జి అధికారి నెల్లూరు నుంచి కార్యాలయానికి వచ్చి పోతుంటారు. ఇక మండలంలో పాలన ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు.

వయోభారమని చెప్పి.. పెంచిన తల్లిదండ్రులను వదిలేసి

అనంతసాగరం, న్యూస్‌టుడే: కడు పేదరికంతో జీవిస్తున్నా.. పిల్లలు లేరనే బాధ ఆ దంపతులను మనోవేదనకు గురిచేసింది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఓ పాపను దత్తత తీసుకున్నారు. అల్లారు ముద్దుగా పెంచి. . పెళ్లి చేశారు. ఆ క్రమంలోనే దంపతులకు వయోభారం దరి చేరింది. తనకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పరచిన వారిని చూసుకోవాల్సిన బాధ్యతను మరిచి ఆ కుమార్తె వదిలించుకున్న ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిలలో శనివారం చోటు చేసుకుంది. వృద్ధ దంపతుల కథనం మేరకు గూడూరు మండలం ఇందూరుకు చెందిన బండి రమణయ్య, లక్ష్మమ్మలకు పిల్లలు లేకపోవడంతో కుటుంబ సభ్యుల సలహా మేరకు ఓ అమ్మాయిని దత్తత తీసుకుని పెంచి పెళ్లి చేశారు. రాపూరు మండలం గోనుపల్లిలో ఓ పొలంలో కూలీ పనులు చేసుకుంటూ కుమార్తెతో కలిసి అక్కడే ఉంటున్నారు. వృద్ధాప్యం కారణంగా దంపతులకు ఆరోగ్యం క్షీణించింది. లక్ష్మమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కుమార్తె, అల్లుడు.. లక్ష్మమ్మ బంధువుల ఇంటికి తీసుకెళ్తామని చెప్పి సోమశిలలో ఆలయం వద్ద వదిలి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. కానిస్టేబుల్ పెంచలయ్య వృద్ధులను విచారించి సోమశిలలోని బంధువులకు సమాచారమిచ్చి ఆటోలో బంధువుల ఇంటికి చేర్చారు.


ఆటోలోకి ఎక్కిస్తున్న కానిస్టేబుల్ పెంచలయ్య

‘మానవత్వం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం’

తిరుపతి (భవానీనగర్),: మాజీ సీఎం జగన్ మానవత్వం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తితిదే అన్న ప్రసాదాలకు అవసరమైన నెయ్యిని తిరుపతి పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారికి ఆవులను రాయితీ ద్వారా ఇప్పించి నెయ్యిని సమకూర్చుకునేలా తితిదే అధికారులు ఆలోచించాలని సూచించారు.


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

నిర్బంధాల ఘనత వైకాపాదే: తెదేపా నేత నరసింహయాదవ్



‘మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటనను ఎవరూ అడ్డుకోవాలనుకోలేదు. గతంలో పోలీసులతో కూటమి నేతలను నిర్బంధాలు చేయించిన ఘనత వైకాపా నాయకులకే దక్కింది’ అని నరసింహయాదవ్ ప్రెస్‌క్లబ్‌లో అన్నారు.

మాజీ సీఎం తిరుమల పర్యటన డ్రామా: జనసేన నేత కిరణ్‌రాయల్



‘మాజీ సీఎం జగన్ తనపై ఉన్న సీబీఐ కోర్టు కేసుల వాయిదాలను తప్పించుకోవాలనే తిరుమల పర్యటన డ్రామా ఆడారు. తిరుపతిలో మత కల్లోలాలు సృష్టించాలని కుట్ర పన్నారు. వైకాపా వారు వారిపై వారే కొడుకుని, టమాటాలు వేయించుకుని కూటమి నేతలపై నెట్టాలని చూశారని కిరణ్‌రాయల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు.

శ్రీవారి అనుగ్రహంతోనే దర్శనమవుతుంది: భాజపా నేత భానుప్రకాశ్‌రెడ్డి



‘శ్రీవారి అనుగ్రహం ఉన్న వారికి మాత్రమే ఆయన దర్శనం కలుగుతుంది. జగన్‌కి శ్రీవారి అనుగ్రహం లేదనే తిరుమల పర్యటనను రాలేపోయారు. తితిదే, అనుబంధ దుకాణాలు ఎక్కడైనా దళితులను ఆలయ ప్రవేశం చేయకుండా మేము అడ్డుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా’నని భానుప్రకాశ్‌రెడ్డి ప్రెస్‌క్లబ్‌లో పేర్కొన్నారు.

కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్


జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు (న్యాయవిభాగం): పెండింగ్ కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవన సముదాయంలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులకు రెండు రోజుల కార్యశాల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విచారణలో ఎప్పటికప్పుడు లోటుపాట్లు సవరించుకుని.. ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు జ్ఞానికలు అందజేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు సత్కరించారు. జిల్లా న్యాయమూర్తులు రమేష్, శాంతి, శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి వెన్నెల పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి


ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీజేఐ ధనంజయ వై.చంద్రచూడ్ దంపతులు

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారిని శనివారం రాత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు తితిదే ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తదితరులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. సీజే దంపతులు ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

సీజేఐకు ఘనస్వాగతం.. రేణిగుంట, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ వై.లక్ష్మణ్‌రావు, హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ జస్టిస్ రాఘవస్వామి, హైకోర్టు రిజిస్ట్రార్ మేనేజ్‌మెంట్ జస్టిస్ రామకృష్ణ, ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, చీఫ్ ప్రొటోకాల్ అధికారి గురునాథ్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభంభన్సల్, ప్రొటోకాల్ మెజిస్ట్రేట్ కోటేశ్వరరావు, సూపరిటెండెంట్ ధనుంజయనాయుడు తదితరులు స్వాగతం పలికారు.


ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ కె.ఆర్.శ్రీరామ్ ◆ జస్టిస్ సెంథిల్ కుమార్

శ్రీవారిని దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు సీజే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఆర్.శ్రీరామ్, న్యాయమూర్తి జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న సీజే, న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు..

తిరుమల: శ్రీవారిని శనివారం తెదేపా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వైకాపా ఎమ్మెల్సీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, భరత్, తెలంగాణ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయం వెలుపలకు వచ్చిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఆలయ మహాద్వారం సమీపంలోనే పోలీసులు చేరుకుని ఆలయం వద్ద రాజకీయ వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఆలయం నుంచి కారు ఎక్కేంత వరకు పోలీసులు ఆయన్ను అనుసరించారు.

పరుగుల వర్షం


దీక్ష


గ్రీష్మ


యశోద


రిషిత

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-15 ప్రాబబుల్స్ మ్యాచ్ నందమూరి తారక రామారావు క్రీడా మైదానంలో శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు. గ్రౌండ్ ‘ఎ’లో టీమ్ ‘ఎ’ బ్యాటింగ్ చేపట్టి 9 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేశారు. జట్టులో అక్షయ 60, సాహితి 36 పరుగులు చేశారు. టీమ్ ‘బి’ తరపున బౌలింగ్ చేపట్టిన యశోద 4, మౌనిక, సహస్ర చెరి రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన టీమ్ ‘బి’ 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేశారు. జట్టులో సృజన 37, మాధురి 34 పరుగులు చేశారు. టీమ్ ‘ఎ’ తరపున బౌలింగ్ చేసిన రిషిత 4, మనవత్ 2 వికెట్లు తీశారు. 8 పరుగులు తేడాతో టీమ్ ‘ఎ’ విజయం సాధించింది. గ్రౌండ్ ‘బి’లో తొలుత టాస్ గెలిచిన టీమ్ ‘సీ’ బ్యాటింగ్ చేపట్టి 5 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేశారు. జట్టులో దీక్ష 146, గ్రీష్మ 94 పరుగులు చేశారు. టీమ్ ‘డి’ బౌలింగ్ చేపట్టిన గెహనా, దార రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బరిలో దిగిన టీమ్ ‘డి’ 1 వికెట్ నష్టానికి 178 పరుగులు చేశారు. జట్టులో ధన 90, ఐశ్వర్య 37 పరుగులు సాధించారు. టీమ్ ‘సి’ 131 పరుగుల తేడాతో గెలిచింది.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

గృహ లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరణి సమావేశం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: మన ఇళ్లు- మన గౌరవం పేరుతో స్థానిక గృహ నిర్మాణ సంస్థ ఈఈ కార్యాలయం ఆవరణలో శనివారం గృహ లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి అర్బన్‌కు సంబంధించి ఆరు లేఔట్లు, సొంత స్థలాలు కలిగిన లబ్ధిదారులకు 20,104 గృహాలు మంజూరు చేశారని.. 1,601 గృహాలు పూర్తి కాగా.. మిగిలిన 18,509 గృహాలను 2025 మార్చిలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. మీ ఇంటి స్థలం ఎక్కడుందో తెలుసా అంటూ లబ్ధిదారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. తమకు తెలియదని వారు సమాధానం ఇవ్వడంతో అసహనం వ్యక్తం చేశారు. త్వరలో లేఔట్లు సందర్శించి అన్ని విషయాలు కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

చంద్రగిరి, న్యూస్‌టుడే:

సమస్య: నరశింగాపురం పంచాయతీ రాజావీధిలోని పంచాయతీ బోరుబావి వద్ద రెండు రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. **-మహేశ్వర్, స్థానికులు**

సమాధానం: పైపుల మధ్య చెడిపోయిన లెదర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తాం. **-చెంచురత్నంశెట్టి, సర్పంచి**

అక్రమ షెడ్ల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: భాగ్యనగరం కశింకాలువ గడ్డపై అక్రమంగా రెవెన్యూ అధికారి షెడ్లను ఏర్పాటు చేశారు. దీనిపై 'ఈనాడు'లో 'కాలువ గడ్డ.. చేసెయ్ కబ్జా' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన తహసీల్దార్ రామాంజులునాయక్ సిబ్బందిని పంపించి తొలగించారు.



కమిషనర్ మౌర్యను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కమిషనర్‌కు సత్కారం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతిలో వినాయక చవితి వేడుకలు విజయవంతం కావడంపై వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కమిషనర్‌ను కలిసి సత్కరించారు. వినాయకచవితితో పాటు నిమజ్జన ఏర్పాట్లలో ఎంతో సహకరించిన తుడా, నగరపాలకసంస్థ అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపినాథ్, మధు తదితరులు ఉన్నారు.

నగరంలో కుండపోత వర్షం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: నగరంలో శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం ఐదు నుంచి ఆరు వరకు ఓ గంట పాటు, తిరిగి రాత్రి 9 నుంచి 11 గంటల వరకు భారీ వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగరంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడ చూసినా వర్షపు నీటితో రోడ్లన్నీ నిండిపోయాయి. రాత్రి కావడంతో కాలువ ఏదో.. గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. తిలక్ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండు, నాలుగు కాళ్ల మండపం, గ్రూప్ థియేటర్ల ప్రాంతం, సింగాలగుంట, సంజయ్ గాంధీ కాలనీ, సుభాష్ నగర్, మధురా నగర్, చిన్న బజారు వీధి గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.



అలిపిరి బైపాస్ కొర్లగుంట వద్ద..





పాత నగరపాలక సంస్థ



అబ్బన్న కాలనీలో ఇలా..

చిరుధాన్యాలతో ఆరోగ్యం

మహిళా వర్సిటీ(తిరుపతి): చిరుధాన్యాలతో ఆరోగ్యంగా ఉండవచ్చని మిల్లెట్స్ వంటకాల నిపుణులు రాంబాబు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ గృహ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం మిల్లెట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సజ్జలు, జొన్నలు, కొర్రలు, సాములు, తదితర చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ విధానాలను వివరించారు.

నైపుణ్యాలు కలిగి ఉండాలి

మహిళా వర్సిటీ(తిరుపతి): విద్యార్థినులు చదువుతోపాటు సృజనాత్మక నైపుణ్యాలను కలిగి ఉండాలని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థినులకు శనివారం నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. నాంది ఫౌండేషన్ శిక్షకులు ఆయేషా, జీవన్‌కుమార్ విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు.

బాధ్యతల స్వీకరణ.. తిరుపతి (గ్రామీణ): తిరుపతి గ్రామీణ మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా హిమంతుకుమార్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఎంపీడీవో రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుడిపాల మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి గ్రామీణ మండలం ఏఈగా బాధ్యతలు స్వీకరించారు.



హిమంతుకుమార్

ఆకతాయిలకు పోలీసుల హెచ్చరిక.. చంద్రగిరి: పనపాకం పంచాయతీలో కొద్దిరోజులుగా దారిన వెళ్లే మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న ఆరుగురు యువకుల్ని పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మరోసారి ఇలా చేస్తే కేసులు నమోదుచేసి న్యాయస్థానానికి అప్పగిస్తామని హెచ్చరించారు. యువకుల వాంగ్మూలం నమోదు చేసి పూచీకత్తుపై విడిచి పెట్టారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు డీడీ అందజేస్తున్న సీఆర్ తేజేశ్వర్, సీఆర్ రాజన్

వరద బాధితులకు రూ.లక్ష సాయం

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు చిత్తూరు తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఆయన కుమారుడు సీఆర్ తేజేశ్వర్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఈ మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు.

కమర్షియల్ ట్యాక్స్ అధికారికి సన్మానం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా విచ్చేసిన శ్రీనివాసులు నాయుడును ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన కుమార్‌రాజు, కార్యదర్శి వాసుదేవన్, సభ్యులు శశిధర్, మలిశెట్టి రవి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులు నాయుడును అభినందిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని డీఈవో శేఖర్ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శనివారం ఓ ప్రైవేటు హోటల్లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యావిధానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. డీఈవో శేఖర్ మాట్లాడుతూ.. స్మైల్ ఫౌండేషన్ రెండు సంవత్సరాలుగా జిల్లాలోని 38 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని వెలికి తీసేందుకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ కె.విజయ సారథి, డీవైఈవోలు బాలాజీ, మధు, 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో శేఖర్

వ్యవసాయశాఖ జిల్లా శిక్షణ సమన్వయకర్తకు ఉద్యోగోన్నతి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉంటూ తిరుపతి జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న రత్నప్రసాద్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సీనియర్ ఏడీఏ భాస్కరయ్యకు జిల్లా సమన్వయకర్తగా పూర్తి బాధ్యతలు అప్పగించారు.

అలరించిన స్టైల్స్ అండ్ వీవ్స్ వస్త్ర ప్రదర్శన

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతిలోని హోటల్ వివాహ భోజనంబు వేదికగా ఏర్పాటు చేసిన స్టైల్స్ అండ్ వీవ్స్ వస్త్ర ప్రదర్శన ఫ్యాషన్‌ప్రియులు, మగువలను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మంజులత మాట్లాడుతూ వివాహ, పండుగలతో పాటు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించే ఉప్పాడ, కలంకారి, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్, బ్లౌజ్‌లు, టాప్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.



ప్రదర్శనలో సందడి చేస్తున్న మహిళలు

టీకాతోనే రేబిస్ నయం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: టీకాతోనే రేబిస్‌ను పూర్తిగా నయం చేయవచ్చని డీఎంహెచ్‌వో శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా రుయా నుంచి ఎస్వీ వైద్య కళాశాల వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఏఆర్‌టీ టీకా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా లభిస్తుందని చెప్పారు. డీఎస్‌వో హరిత, డీఎంవో రూప్‌కుమార్, లావణ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: నెరబైలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం రేబిస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి కృష్ణచైతన్య, ఆరోగ్య విస్తరణ అధికారి నరసింహప్రసాద్, వైద్య సహాయక సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో, రుయా సూపరింటెండెంట్ తదితరులు

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్‌ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024-2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది? జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)

జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.) జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM'ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024 తెలుగు కంటెంట్

పదోతరగతి తెలుగు



ప్రత్యక్ష దైవాలు

తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. **తల్లిదండ్రులు:** పోతమ్మ, సూరనలు. **జననం:** పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). **ఉద్యోగం:** అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. **రచనలు:** రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం **బిరుదులు:** శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. **రచనా శైలి:** సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ◆ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఏపీపీ)

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ,

> 6 దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండొనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

1) **తరిగిపోయేవి:** వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) **తరగనివి:** ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98% ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

పీట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

> 6 దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> 6 ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన

> 6 ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> 6 ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.

చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

> రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

జలాశయాలకు తాగునీటి పథకాల అనుసంధానం

● మళ్లీ తెరపైకి వాటర్ గ్రిడ్ పనులు ● ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా



కండలేరు-పూండి కాలువ

గూడూరు, న్యూస్‌టుడే: పల్లెలకు సురక్షిత తాగునీటిని అందించే వాటర్ గ్రిడ్ పనుల వైపు రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని వైకాపా పక్కన పెట్టేయడం.. ఫలితాలు ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా సమీక్షలో నీటి పథకాలు జలాశయాలకు అనుసంధానించే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు నదులు, సర్వీసు రిజర్వాయర్లను పైపులైన్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంది. ఇదే తీరుగా సంపులు, చెరువులు నీటితో నింపే పథకాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఏటా పల్లెలకు నిత్యం నీటిని అందించే అవకాశం కలుగుతుంది. చిత్తూరు జిల్లాలో 3.53 లక్షలు, తిరుపతి జిల్లాలో 3.85 లక్షల గృహాలున్నాయి. ఇవన్నీ పల్లె ప్రాంతాలు కాగా నేరుగా నీటి సరఫరా చేసే పథకాలు ఎక్కువగా ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్‌లో పెద్దఎత్తున నిధులు వచ్చినా కుళాయి కనెక్షన్ల పేరిట రూ. కోట్ల వ్యయం చేసింది వైకాపా సర్కార్. ఉన్న పథకాలు నీటి వనరులు లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. నీటి వనరులు అందుబాటులో లేకుండానే వైకాపా ప్రభుత్వం ఇంటింటికి కుళాయిలు ఇచ్చింది. ఇవి చాలా చోట్ల మొక్కుబడి కాగా వాటిని సరిచేసే ప్రక్రియ తాగునీటి సరఫరా శాఖ చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ తాగునీటి పథకాలు

వివరాలు	తిరుపతి	చిత్తూరు
కాలనీలు	4,008	5,310
గృహాలు	3,85,684	3,53,147
నీటి కనెక్షన్లు	2,67,788	2,96,306
సీపీడబ్ల్యూఎస్	24	02
ఎంపీడబ్ల్యూఎస్	2,155	960
డైరెక్ట్	2,672	1,718
చేతిబోర్లు	34,958	29,516

కండలేరు నీటిని తెచ్చే ఏర్పాట్లు


ఉమ్మడి జిల్లాలోని పల్లెలకు కండలేరు నీటిని తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇలా ఆ నీటిని జలాశయాలు, చెరువుల్లో నింపి అక్కడి నుంచి ఓహెచ్‌ఆర్‌లకు నీటిని అందించే ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాలకు సుమారుగా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేయాల్సి ఉంది.

■ చిత్తూరు జిల్లాలో విజయపురం, నింద్రమినహా ఎక్కడా సమగ్ర రక్షిత నీటి పథకాలు అందుబాటులో లేవు. ఆయా ప్రాంతాల్లో సురక్షిత నీటిని అందించే ప్రణాళిక గ్రామీణ తాగునీటి శాఖ చేపడుతోంది. చిత్తూరు పడమర ప్రాంతాల్లో రూ.2,665 కోట్ల అంచనాలతో చేపట్టిన పథకం ముందుకు కదల్లేదు. కాగా గతంలో తిరుపతి జిల్లాకు ఏమీ కేటాయించక పోగా.. ప్రస్తుతం రూ.2,400 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఇలా రెండు జిల్లాల్లో నీటి పథకాలకు అంచనాలు చేస్తున్నారు.

> **అంచనాలు సిద్ధం చేయాలి**
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. అంచనాలు చేపట్టి పథక రచన చేయాల్సి ఉంది.
>
> – విజయకుమార్, ఎస్ఈ, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, తిరుపతి

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు క్షత్రియ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి క్షత్రియ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (29 సెప్టెంబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

ఏఓఎంఎస్ఐ సభ్యుడిగా ధరణి చౌదరి



తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మ్యాక్సిల్లో ఫెషల్ సర్జన్ ఆఫ్ ఇండియా(ఏఓఎంఎస్ఐ) ఈసీ మెంబరుగా తిరుపతికి చెందిన ప్రముఖ ఓరల్ అండ్ మ్యాక్సిల్లో ఫెషల్ సర్జన్ డాక్టర్ కిలారి ధరణి చౌదరి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరుగుతున్న 16వ రాష్ట్ర సదస్సులో ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో జరిగే 49వ జాతీయ సదస్సుకు నిర్వహణ సభ్యులుగా నియమించారు.

'సిట్‌తో చంద్రబాబు లబ్ధిపొందాలని చూస్తున్నారు'



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, మేయర్ శిరీష, వైకాపా నాయకులు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై వచ్చిన ఆరోపణలపై తాము సీబీఐ విచారణ జరిపించాలని కోరితే, సీఎం చంద్రబాబు మాత్రం తాను కూర్చోమంటే కూర్చుకునే సిట్‌తో దర్యాప్తు జరిపించి, లబ్ధి పొందేందుకు చూస్తున్నారని తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. వైకాపా రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నగరంలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శనివారం ఆయనతోపాటు వైకాపా శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తితిదే అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, తెలుగుదేశం బంటుల్లా, చంద్రబాబు ఏజెంటుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోజూ కనీసం ఏడెనిమిది వందల మంది ఇతర మతస్థులు దర్శనానికి వస్తారని, వారి వద్ద ఎలాంటి డిక్లరేషన్లు అడగలేదని, కేవలం జగన్ వద్దనే అడిగారని విమర్శించారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జూపార్కు మార్గంలో అనధికార దుకాణాలు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి నుంచి జూపార్కుకు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల అనధికారికంగా దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పెరగడం, అరవింద్ ఐ ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆసుపత్రులకు, జూపార్కుకు, సైన్స్ సెంటర్‌కు జనం పెద్దఎత్తున వస్తున్న తరుణంలో వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి. ఇన్నాళ్లు తాత్కాలికంగా తోపుడు బండ్లు, వాహనాలపై వ్యాపారం చేసినవారు ఇప్పుడు శాశ్వతంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సైన్స్ సెంటర్ నుంచి టాటా క్యాన్సర్ ఆసుపత్రి వరకు రోడ్డుకు రెండు వైపులా షెడ్లు, పాకలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటి వెనుక కొందరు నేతలు, అటవీశాఖ అధికారులు ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వారి నుంచి కొంత నగదు వసూలు చేసి, దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్టు తెలిసింది.



అరవింద్ ఐ ఆసుపత్రికి ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణం



పుస్తకావిష్కరణలో ఆచార్య రాణి సదాశివమూర్తి తదితరులు

'రంగ వీక్షణం' పుస్తకావిష్కరణ

తిరుపతి జిల్లా వార్తలు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఆకాశవాణి విశ్రాంత అధికారి ఆకుల మల్లేశ్వరరావు రచించిన 'రంగ వీక్షణం' వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభ శనివారం ఓ ప్రైవేటు హోటల్లో జరిగింది. ఎస్వీ వేదిక్ విశ్వవిద్యాలయ వీసీ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ.. మల్లేశ్వరరావు కథలు, నవలలు, పాటలు, నాటకాలు ఇలా అన్ని రంగాల్లోనూ వ్యాసాలు వెలువరించారన్నారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, బీఎన్‌రెడ్డి, రాఘవాచారి, గరికపాటి రమేష్ బాబు, శతావధాని ఆముదాల మురళి, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు కిషోర్, వేదికపై టీజీ వెంకటేష్, నాయకులు

ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య సంఘం తిరుపతి జిల్లా గ్రామీణ అధ్యక్షుడిగా ఎంపికైన గూడూరు కిషోర్ కుమార్ శనివారం ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. వీరి వెంటే ప్రధాన కార్యదర్శి గాధంశెట్టి నాగరాజు, కోశాధికారిగా పత్తిపాటి తులసి కృష్ణ, మహిళా అధ్యక్షురాలు కాకుమాని సావిత్రి, మహిళా ప్రధాన కార్యదర్శిగా గుంపర్ల ప్రభావతి, కోశాధికారిగా పోకూరు అరుణమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు టి.జి. వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సంఘటితంగా వ్యవహరించడం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం నేతలు షణ్ముఖరావు, శ్రీనివాస్, నరసింహులుశెట్టి లక్ష్మయ్య, నాయుడుపేట పట్టణ నాయకులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ బదిలీ

జీవకోన(తిరుపతి): ఏపీ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా ఇటీవల బదిలీపై వచ్చిన మురళీధర్ మళ్లీ అనంతపురం పోలీసు శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆయన్ను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

జిల్లా స్థాయి పోటీల్లో ఝాన్సీ ప్రతిభ



డీఈవో నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఝాన్సీ

వరదయ్యపాళెం: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్-2047 జిల్లాస్థాయి పోటీల్లో సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.ఝాన్సీ వక్తృత్వ విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. డీఈవో శేఖర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంది. బాలికకు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు అమృత గైడ్‌గా వ్యవహరించారు. వ్యాసరచన పోటీల్లో కారిపాకం ఉన్నతపాఠశాలకు చెందిన మునిలోహిత బహుమతి సాధించారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఈతమాకుల కిరణ్మయి శనివారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయానికి వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రస్తుత ఆర్డీవో చంద్రముని బాధ్యతలు అప్పగించారు. ఆమెను డీఏవో కె.రవికుమార్, తహసీల్దార్ నరసింహారావు, కార్యాలయ ఉద్యోగులు పుష్పం గుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

సత్యవేడులో క్రీడాభివృద్ధికి చేయూతనివ్వండి



రవినాయుడును సన్మానిస్తున్న నాగలాపురం తెదేపా నేతలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి చేయూతనివ్వాలని శాప్ ఛైర్మన్ రవినాయుడును నాగలాపురం తెదేపా నేతలు కోరారు. శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనతో నేతలు శనివారం భేటీ అయ్యారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులుయాదవ్, ప్రణీత్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, లీలాప్రసాద్, పార్థిబన్, జాన్సన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు కరకంబాడి విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేణిగుంట, న్యూస్‌టుడే: జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారని కరకంబాడి జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు రెడ్డయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు శివకృష్ణారెడ్డి, రోహిత్‌రెడ్డి, కావ్యశ్రీ, భానుచంద్ర, ఆశ్రిత్, హేమన్ కుమార్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

9 కిలోమీటర్లు గుంతలు

- స్పందించని జాతీయ రహదారులు, నగరపాలక అధికారులు
- ప్రమాదాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న వైనం



రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

రేణిగుంట, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయి. తిరుపతి నగరపాలక సంస్థ, జాతీయ రహదారుల అధికారులు తీరుకు ప్రత్యక్ష సాక్ష్యాలు. రోడ్డులో ఏర్పడిన గుంతల వద్ద అడ్డుగా బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు మినహా మరమ్మతులకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

కన్నెత్తి చూడని అధికారులు

తిరుపతిలోని రామానుజ కూడలి నుంచి రేణిగుంట వంతెన వద్దకు 9 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ 9 కి.మీ. దూరంలో నగరపాలక సంస్థ డ్రైనేజీ పైపులైన్ కారణంగా 9 గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు అంటే సాధారణ గుంతలు కావు. భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గత ఐదేళ్లుగా ఈ గుంతలను పూడ్చాలని లేదా మరమ్మతులు చేయాలనే ఆలోచన సంబంధిత అధికారుల్లో కలగకపోవడం దారుణం. ఈ మార్గంలో శెట్టిపల్లి రైల్వేగేటు ఎదుట సుమారు ఏడు సంవత్సరాల కిందట గుంత ఏర్పడింది. దానిని ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. పైగా ఆ గుంత వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు పడిపోయింది. ఇక్కడ మలుపు కావడంతో వాహనాలు వేగంగా వచ్చి ఢీ కొంటున్నాయి. ఇక్కడ లెక్కలేనంత మంది ద్విచక్ర వాహన చోదకులు కిందపడి గాయాల పాలయ్యారు. అయితే జాతీయ రహదారుల అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

బారికేడ్లు పెట్టేశారు

25 ఏళ్ల క్రితం తిరుపతిలో అండర్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేశారు. పైపులైన్ ద్వారా ఆ వ్యర్థాలు రేణిగుంట మండలంలోని తూకివాకం పంచాయతీ ఎర్రమరెడ్డిపాలెం వెనుక ఉన్న తిరుపతి నగరపాలక సంస్థ డ్రైనేజీ కేంద్రానికి అనుసంధానం చేస్తున్నారు. అయితే అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు అప్పుడప్పుడూ గుంతలు ఏర్పడుతూనే ఉంది. దీనికి శాశ్వత పరిష్కారం మాత్రం చేపట్టలేదు. పైగా గుంతలు ఏర్పడిన ప్రదేశంలో బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు సంస్థ అధికారులు.

త్వరలో టెండర్లు పిలుస్తాం

ఇక్కడ గుంతలు ఏర్పడిన విషయం నా దృష్టికి వచ్చింది. త్వరలో టెండర్లు పిలుస్తాం. అనంతరం వెంటనే ఇక్కడ నూతనంగా పనులు చేయించి బాగు చేస్తాం.

– ఎన్.మౌర్య, కమిషనర్, తిరుపతి నగరపాలక సంస్థ

జింకను రక్షించిన ప్రజలు



జింకకు ప్రథమ చికిత్స చేస్తున్న అటవీ సిబ్బంది

తొట్టంబేడు, న్యూస్‌టుడే: తెలుగుగంగ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న జింకను స్థానికులు రక్షించిన ఘటన తొట్టంబేడు మండలం లక్ష్మీపురం వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిల్లమేడు అటవీ ప్రాంతం సమీపంలో తిరుపతికి తాగునీరు సరఫరా చేసే పంప్ హౌస్ వద్ద తెలుగుగంగ కాలువలో దప్పిక తీర్చుకునేందుకు దిగిన ఓ జింక కొట్టుకుపోవడాన్ని గుర్తించిన గ్రామస్థులు తాళ్లతో ఒడ్డుకు చేర్చారు. తొట్టంబేడు పోలీసుల సాయంతో అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ సిబ్బంది జింకకు ప్రథమ చికిత్స చేసి సమీప అడవిలో విడిచి పెట్టారు.

విద్యార్థుల ఎంపిక



నిరంజన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఏర్పేడు, న్యూస్‌టుడే: పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి నిరంజన్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి జూడో పోటీల్లో 40 కిలోల విభాగంలో ఉత్తమ ప్రతిభను కనబరచి ప్రథమస్థానంలో నిలిచిన ఇతను రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అభినందించారు. ● **నారాయణవనం:** జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు నారాయణవనం బాలుర ఉన్నత విద్యార్థులు ఎంపికైనట్లు పీడీలు సదాశివన్, జయప్రకాష్ తెలిపారు. శనివారం నాగలాపురంలో జరిగిన కబడ్డీ పోటీల్లో విద్యార్థులు సుశాంత్, అజయ్ జోష్, గౌతమ్, నితిన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

ఇలాగైతే ఎలా?



వస్త్రాన్ని అడ్డుగా ఉంచిన వైనం



తలుపునకు లేని గొళ్లెం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ప్రత్యేకించి మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల సౌకర్యార్థం శివయ్య గోపురం సమీపంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర క్రితం వైకాపాకు చెందిన గుత్తేదారులు ఈ పనులు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఇక్కడ అమర్చిన కుళాయిలన్నీ దెబ్బతిన్నాయి. స్నానపు గదుల్లో కుళాయిల నుంచి లీకేజీల నియంత్రణకు భక్తులు అక్కడ వదిలివెళ్లే వస్త్రాలను కట్టాల్సిన పరిస్థితి. అయినప్పటికీ నీళ్లన్నీ వృథా అవుతూనే ఉన్నాయి. ఇక తలుపులకు గడులు లేక పోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. బాగు చేసే దిశగా ఇంజినీరింగ్‌శాఖ, ఎప్పటికప్పుడు శుభ్రం చేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య విభాగం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఘనంగా గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి



గుర్రం జాషువా, బోయి భీమన్న జయంతిని పురస్కరించుకుని కవులను సత్కరిస్తున్న సామాజిక సమరసత వేదిక సభ్యులు

రేణిగుంట, న్యూస్‌టుడే: గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, బీసీ వసతిగృహంలో సాహితి ప్రవంతి, వేమన విజ్ఞాన వేదిక, జేవీవీ ఆధ్వర్యంలో గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. గుర్రం జాషువా విశ్వనరుడు పద్యాన్ని అందరూ ఆలపించారు. భగత్‌సింగ్ త్యాగాలు, పోరాటాలను మననం చేసుకున్నారు. వెంకటరమణ, చంద్ర, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణ సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులు అర్పించారు. సమావేశంలో మణి, గురవయ్య, వెంకటేష్, కుమార్, అన్వర్‌బాషా, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తెలుగు మాధుర్యాన్ని అన్ని వర్గాలకు చవిచూపిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ కళాశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువాతో పాటు బోయిభీమన్న జయంతి వేడుకలు జరిపారు. కవులు, తెలుగు భాషాభివృద్ధి లక్ష్యంగా శ్రమిస్తున్న ఎం.శంకరయ్య, పూల కృష్ణమూర్తి, పులివర్తి గురునాథం, యువశ్రీ మురళీలను ఘనంగా సత్కరించారు. సుబ్బరామిరెడ్డి, చిలకా రంగయ్య, చంద్రశేఖర్, గరికపాటి రమేష్‌బాబు, సురేష్, పిళ్లారి బత్తినయ్య, జయచంద్రారెడ్డి, నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

తొట్టంబేడు, న్యూస్‌టుడే: గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ముని తిరుమలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

ఈనాడు కథనాలకు స్పందన

ఏర్పేడు, న్యూస్‌టుడే: మునగలపాళెం పంచాయతీ కుమ్మరకండ్రిగలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను దాతలు తొలగించారు. ముళ్లపొదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈనాడులో ‘ మేమున్నాం మీకుతోడుగా’ శీర్షికతో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామానికి చెందిన కుమార్ సొంత నిధులతో జేసీబీతో ముళ్ల చెట్లను తొలగించి సమస్యను పరిష్కరించారు.

తాగునీటి ట్యాంకుకు మరమ్మతు

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని రాజగోపాలపురం గ్రామంలోని తాగునీటి ట్యాంకు నుంచి నీరు లీకై పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. తాగు నీరు కలుషితమౌతుంది. దీనిపై ఈ నెల 26వ తేదీన ఆదివారం ‘ఈనాడు’లో నీటి లీకులతో ఇక్కట్లు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రజిత తాగునీటి ట్యాంకును మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టారు.

మూడు నెలల్లో గృహాలు పూర్తి చేసుకోవాలి



కాలమనాయుడుపేట లే అవుట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు

సత్యవేడు: అసంపూర్తి గృహాలను మూడు నెలల్లో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కాలమనాయుడుపేట, కొత్తమారికుప్పంలో ఇళ్లను పరిశీలించారు.
● **శ్రీకాళహస్తి:** ఇళ్లను త్వరితగతిన నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పురపాలిక కమిషనర్ గిరికుమార్ తెలిపారు. శనివారం 28, 29 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులతో ఆయన సమీక్షించారు.

వార్డు సభ్యుల నిరసన

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీ వార్డు సభ్యులు నిరసనకు దిగారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి నాగేశం అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని చేపట్టారు. ఈ సమావేశాన్ని వార్డు సభ్యులు కాసేపటికి బహిష్కరించారు. నిబంధనల మేరకు... అజెండాలోని అంశాలను పంచాయతీ కార్యదర్శి చదివి వినిపించలేదని ఆరోపించారు. గత సమావేశంలో ఆమోదించిన పనులకు ఎం.బుక్, వోచర్లు చూపాలని అడిగితే పట్టించుకోలేదని తెలిపారు.

కల్యాణ వేంకన్న ఆలయంలో ఏకాదశి ఉత్సవం



తిరుచ్చిపై దేవేరులతో శ్రీనివాసుడు

నారాయణవనం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి సందర్భంగా తిరుచ్చి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. అర్చకులు దేవేరుల సమేత శ్రీనివాసుడిని నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చిపై ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాస రాఘవ భట్టాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం.. రోడ్లన్నీ ఛిద్రం

జగనన్న కాలనీల్లో రోడ్లు అధ్వానం



ఏర్పేడు మండలం చిందేపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో వర్షం పడితే ఇదీ పరిస్థితి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల్లో వర్షం పడితే రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఇళ్లు లేని నిరుపేదల కోసం వైకాపా హయాంలో ఏర్పేడు మండలం చిందేపల్లి, శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని ఊరందూరు జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అంతర్గత రోడ్లు వేసినా చినుకు పడితే రోడ్లన్నీ ఛిద్రమైపోతున్నాయి. ప్రస్తుతం ఇళ్ల పనులు చేసుకోవాలన్నా లబ్ధిదారులు ఆ రోడ్ల గుండా గృహాల వద్దకు వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కాలు పెడితే జారిపోతోంది. ఇక వాహనాల చక్రాల సైతం బురదలో చిక్కుకోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది.

చెరువు మట్టితో కష్టం..

జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకు పలు చోట్ల చెరువు మట్టిని వినియోగించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడటంతో రోడ్లన్నీ గుంతల్లా మారి పోవడంతో పాటు అడుగు పెడితే ప్రమాదకర పరిస్థితులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే ఇలాగైతే రానున్న వర్షాకాలంలో తమ పరిస్థితి ఏమిటని బోరుమంటున్నారు. అధికారులు మాత్రం లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ చర్యలు చేపడతామని చెబుతుండటం గమనార్హం.



ఊరందూరు జగనన్న కాలనీలో ప్రధాన రోడ్ల దుస్థితి

కాలు పెడితే ప్రమాదమే!



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రంగుల గోపురం సమీపంలో రుణవిమోచన గణపతి సన్నిధి ఎదుట ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ నీటి కాలువ వద్దకు భక్తులు గుంపుగా చేరుతుంటారు. ఇక్కడున్న మ్యాన్‌హోల్ ధ్వంసమై కమ్ములన్నీ బయటకు వచ్చాయి. పొరపాటున భక్తులు కాళ్లు పెడితే ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. తక్షణం దీన్ని బాగు చేసే దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

తారకరామానగర్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు



రాజకీయ పార్టీ నేతలతో సమావేశమైన తహసీల్దార్ లక్ష్మీనారాయణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని తారకరామానగర్‌లో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయమై తహసీల్దార్ లక్ష్మీనారాయణ పలు పార్టీల నేతలతో స్థానిక కార్యాలయంలో సమీక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 1,500 ఓట్లు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తారకరామానగర్‌లో 1491 ఓట్లున్నా.. సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో మరో కేంద్రం ఏర్పాటుపై చర్చించారు.



దర్గాలో ఆశీస్సులు అందుకుంటున్న గజల్ శ్రీనివాస్


దర్గాను దర్శించిన గజల్ శ్రీనివాస్

శ్రీకాళహస్తి: స్థానిక బి.పి.అగ్రహారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ ఖాదర్‌వలీ అల్లా వారి ఉరుసు సందర్భంగా గజల్ శ్రీనివాస్ దర్గాను దర్శించుకున్నారు. గంధోత్సవం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన శనివారం దర్గాకు వచ్చారు. దర్గా పీఠాధిపతులతో పాటు ఉరుసు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. గజల్ గానంతో కొద్దిసేపు అందరినీ ఆనందపరిచారు.

ఈవో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆలయంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దళారుల ఆటకట్టించేందుకు ఆలయ మహాద్వారం నుంచి అన్నీ క్యూలైన్లను పర్యవేక్షించారు. స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అంతరాలయ దర్శనాలు నిలువరించే దిశగా చర్యలు చేపట్టడంతో భక్తులు సంతృప్తికరంగా దర్శనం చేసుకోగలిగారు.

పారిశ్రామిక క్షేత్ర పర్యటన



మదనంజేరిలోని సిమెంట్ పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: విద్యార్థులకు విజ్ఞానంపై అవగాహన, ఆసక్తి పెంపొందించేలా పరిశ్రమ సందర్శన ఉపయుక్తమవుతుందని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులను బిస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆధ్వర్యంలో శనివారం సత్యవేడు మండలం మదనంజేరిలోని విష్ణుచక్ర సిమెంటు పరిశ్రమకు పారిశ్రామిక క్షేత్రపర్యటనకు తీసుకెళ్లారు. బిస్ విజయవాడ రీజినల్ మేనేజరు శ్రీకృష్ణవీర్, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, సమన్వయకర్త మేఘనాథ్, వ్యాయామ ఉపాధ్యాయుడు బందిల కుమార్ ఆధ్వర్యంలో పరిశ్రమలో సిమెంటు తయారీ విధానాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించారు. చక్ర సిమెంటు పరిశ్రమ మేనేజర్ నవనీత కన్నన్, ఉపాధ్యాయులు గురవయ్య, లత, భువనేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా మార్చుకుందాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం సాధ్యమని శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో గ్రామంలో నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఆమె మాట్లాడారు. బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, శాంతి, సుబ్రహ్మణ్యం, గుణశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావాలి

నారాయణవనం, న్యూస్‌టుడే: ప్రజలందరూ రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. శనివారం నారాయణవనం పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈవో షణ్ముగం, అధికారులు, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఏర్పేడు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్రను తీర్చిదిద్దేంకు కలసికట్టుగా శ్రమిద్దామని తెదేపా అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి తెలిపారు. మన్నసముద్రంలో స్థానిక నేతలతో కలసి శనివారం స్వర్ణాంధ్ర-2047 కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. సదాశంకర్, మునెయ్య, వెంకటేష్, తులసీరాం, శంకరయ్య, మణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి



దాతలు అందించిన విద్యాసామగ్రితో విద్యార్థులు

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసిస్తే ఉన్నత లక్ష్యాలు చేరవచ్చని చిత్తూరుకు చెందిన అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్‌రెడ్డి, పూర్ణిమ అన్నారు. శనివారం కళ్లివెట్టు ఉన్నత పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలోని 170 మందికి ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, శతపద్యాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సమన్వయకర్త ఆముదాల మురళి, ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీమురళి, వేణుగోపాల్, సురేష్‌బాబు, వేణుగోపాల్, దేవీప్రసాద్, మాదవీలత, దేవేంద్ర, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద మన జానపదం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, చిగిచెర్ల కృష్ణారెడ్డి తదితరులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్యవేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జానపద సంస్కృతి, కళలపై సాగిన ప్రసంగం శ్రోతలను అలరించింది. హైదరాబాద్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి తనదైన శైలిలో వివిధ కథలు, పాటలు మాండలికాలతో ప్రసంగించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే వారసత్వ సంపదైన జానపదాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి సాహితీవేత్త కంకణబద్ధులు కావాలని శ్రీసిటీ ఎండీ డా.రవీంద్ర సన్నారెడ్డి ఆకాంక్షించారు. సాహిత్యాన్ని పెంపొందించేందుకే శ్రీసిటీలో ఆధ్యాత్మిక, సాహిత్య వేదికగా శ్రీవాణిని ఏర్పాటు చేశామన్నారు. పెరటాసి రెండో శనివారాన్ని పురస్కరించుకుని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ముళ్లపూడిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. వాతావరణ మార్పులు చోటుచేసుకోవడంతో ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేత గురవయ్య, శ్రీధర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బాలుర తండ్రులకు సూచనలిస్తున్న ఎస్సై సునీల్

బాలలకు ద్విచక్రవాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

నాగలాపురం, న్యూస్‌టుడే: బాలలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని ఎస్సై సునీల్ హెచ్చరించారు. నాగలాపురంలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న బాలలను ఆయన పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి తల్లిదండ్రులకు మార్గనిర్దేశం చేశారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ● **రేణిగుంట:** చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రేణిగుంట పట్టణ సీఐ శరత్‌చంద్ర తెలిపారు. శనివారం స్థానిక తపస్య పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కల్పించారు. ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ విక్రం సాలి పాల్గొన్నారు.

నిరుపయోగ ట్యాంకుతో అవస్థలు



బాలికల పాఠశాల ఆవరణలోని ట్యాంకు

సత్యవేడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల ప్లస్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకుతో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిత్యం సతమతమవుతున్నారు. ట్యాంకు గేట్లు లేకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ వెనక వైపు నుంచి దూకి పాఠశాల ఆవరణలోని ట్యాంకు పైకి ఎక్కుతున్నారు. ట్యాంకుకు సరైన మెట్లు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను వివరణ కోరగా.. ట్యాంకుకు గేట్లు ఏర్పాటు చేసి తాత్కాలికంగా మూసివేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడ్డారు. స్థానిక శ్రీకాళహస్తి రహదారిలో నివాసం ఉంటున్న షేక్ రసూల్ శనివారం ఇంటి ఎదుట రోడ్డు దాటుతుండగా ఓ యువకుడు వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో రసూల్ తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కిలో రూ. 80 నుంచి రూ. 100 వరకు

రెండో రకం: కిలో రూ. 60 నుంచి రూ. 80 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

వెంకన్నపాలెంలో గ్రామసభ

కోట: వెంకన్నపాళెంలో శని వారం స్వర్ణాంధ్రవిజన్ 2047 గ్రామ సభను నిర్వహించారు. పలు సమస్యలపై అర్జీలు స్వీక రించారు. సర్పంచి మధయ్య దవ్, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పేర్నాడు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి రమణయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046; నాయుడుపేట: 80085 73970; సూళ్లూరుపేట: 96188 78782; వెంకటగిరి: 80085 73966; సమయం 10 AM TO 1 PM

న్యూస్‌టుడే, చిట్టమూరు(కోట)

సమస్య: చిట్టమూరు మండలం అర్జుఖాని సమీపంలోని ర.భ రోడ్డు గుంతలమయమైంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులు వెంటనే చేపట్టి ప్రమాదాలు నివారించవలసిన అవసరముంది. – ధనయ్య, స్థానికుడు

సమాధానం: రోడ్డుకు మరమ్మతులు చేపడతాం. – సుబ్బయ్యయాదవ్, డీఈ

వర్షంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బాలాయపల్లి: ఓ మోస్తరు వర్షానికి రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి వెంకటగిరి పట్టణం, బాలాయపల్లి మండలం జయంపు, చిలమనూరు తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. 33 కేవీ లైన్లలో సాంకేతిక లోపాల కారణంగా వెంకటగిరితో పాటు డక్కిలి, బాలాయపల్లి మండలం గొల్లగుంట సబ్ స్టేషన్ల పరిధిలో రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి తొమ్మిది గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. డీఈ మునికిషోర్‌రెడ్డి ప్రత్యేకించి లైన్లలో డిస్కంలు డెల్మిని 32 కేవీ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు.

పాఠశాలల తనిఖీ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: వెంకటరెడ్డిపల్లి, వాక్యం తదితర గ్రామాల్లో శనివారం ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసిన ఆయన నాణ్యతగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత సిలబస్ ఏమేరకు పూర్తయిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

'మతవిశ్వాసాలు విస్మరిస్తున్న వైకాపా'

వెంకటగిరి, న్యూస్‌టుడే: వైకాపా నేతలు మత విశ్వాసాలను విస్మరిస్తున్నారని భాజపా వెంకటగిరి అసెంబ్లీ మాజీ కన్వీనర్ మణి అన్నారు. శనివారం ఒక సమావేశంలో మాట్లాడారు. హిందూ ఆలయాల్లో అన్యమతస్తులు తప్పనిసరిగా దర్శించుకునే సమయంలో డిక్లరేషన్‌పై సంతకం పెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

వైకాపా అసమర్థతతో ఇళ్ల నిర్మాణంలో జాప్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, వేదికపై నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అసమర్థ విధానాల కారణంగా పక్కా ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం నాయుడుపేట పట్టణం బీరదవాడ సమీపంలోని టిడ్కోగృహాల సముదాయం వద్ద జరిగిన లబ్ధిదారుల అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. టిడ్కోగృహాలను త్వరలో పంపిణీ చేసి నిరుపేదల సొంతింటి కలలను ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పలువురు తెదేపానాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు జరగక.. అప్పులు పుట్టక

- అన్నదాతల వెతలు
- 18 గ్రామాల్లో ఆగిన క్రయ విక్రయాలు

గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే పుణ్యమా అంటూ ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. దీంతో 18 గ్రామాల్లో క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. రైతులు భూములు విక్రయించేందుకు సిద్ధమైనా.. ఎవరూ ముందుకు రావడం లేదు. అప్పులు పుట్టక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితి సూళ్లూరుపేట డివిజన్లో నెలకొంది. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

కనిపించని దస్త్రాలు

సూళ్లూరుపేట డివిజన్‌లోని పలు గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. సర్వేకు ముందుగా గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్‌ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర పనులు జరిగాయి. అధికారులు రీసర్వే చేసిన తర్వాత రైతుల భూ విస్తీర్ణంతో పాటు వెబ్‌ల్యాండ్‌లో నమోదైన భూ విస్తీర్ణానికి భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. రీసర్వేపై పలువురితో గ్రామ రెవెన్యూ అధికారులకు సైతం అవగాహన లేదు. గత కొన్నేళ్లుగా కొన్నిచోట్ల రెవెన్యూ గ్రామాలకు చెందిన దస్త్రాలు సైతం లేవు. సూళ్లూరుపేట మండలంలోని దామానెల్లూరు రెవెన్యూ గ్రామానికి సంబంధించి, పులికాట్ పక్షి దామానెల్లూరు గ్రామ రెవెన్యూ దస్త్రాల్లో కలిసిపోయాయి. ప్రస్తుతం దామానెల్లూరుకు సంబంధించి కొన్ని దస్త్రాలు కనిపించడం లేదు. అలాగే దామారాయ గ్రామానికి చెందిన దస్త్రాలను దామానెల్లూరు రెవెన్యూ రికార్డుల్లో పొందుపరిచారు. ఇదంతా రెవెన్యూ అధికారుల తప్పిదంతోనే జరుగుతున్నాయి. గ్రామ రెవెన్యూ అధికారులు వారికి ఇష్టమొచ్చినట్లు దస్త్రాలను పలు గ్రామాల్లో నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

రీ సర్వేతో..

ఇదిగో ఇక్కడే..

గత ప్రభుత్వంలో రీ సర్వే చేసిన తర్వాత ల్యాండ్ పార్సిల్ నంబరు(ఎల్‌పీ నంబరు) ఆధారంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని అప్పటి వైకాపా ప్రభుత్వం సూచించింది. ఆ మేరకు రిజిస్ట్రేషన్లు సైతం చేయకుండా ఆపేశారు. అనంతరం రీ సర్వే ఆయిన తర్వాత కొత్తగా ఎల్‌పీ నంబరు ఇచ్చారు. ఒక్కొక్క ఎల్‌పీ నంబరుకు కొన్ని సర్వే నంబర్లను అనుసంధానం చేశారు. సర్వే నంబర్ల ప్రకారం గతంలో ఉన్న విస్తీర్ణానికి ఎల్‌పీ నంబర్ల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకోడానికి తేడాలు వస్తున్నాయి. రీ సర్వే చేసిన అనంతరం సంబంధిత డేటాను ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపారు. సంబంధిత డేటా జిల్లా జాయింట్ కలెక్టర్ స్థాయిలో ఆమోదం పొంది, సీసీఎల్‌ఏకు వెళ్లింది. సీసీఎల్‌ఏ ఆమోదంతో రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో డేటా ఉంది. రైతులు మీసేవా కేంద్రాల ద్వారా పన్‌బీలు, అడంగల్, తదితర పనులు కుంటున్నారు. వాటిని తీసుకుని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్తే తమ వెబ్‌ల్యాండ్‌లో సంబంధిత డేటా లేదని, దాంతో రిజిస్ట్రేషన్లు చేయలేమని చెబుతున్నారు. దీంతో నెలల తరబడి రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. అత్యవసరానికి భూములు విక్రయించుకున్నా రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



సూళ్లూరుపేట ప్రాంతంలో రీసర్వే చేస్తున్న సిబ్బంది

రిజిస్ట్రేషన్లు కావడం లేదు



దొరవారిసత్రం మండలంలోని అక్కరపాక రెవెన్యూ పరిధిలో నాకు కొంత భూమి ఉంది. విక్రయించాలంటే రీసర్వే జరుగుతుందని సర్వే నంబర్లు రిజిస్ట్రేషన్ కావని, ఎల్‌పీఎం నంబర్లు కావాలని చెప్పారు. తీరా రీసర్వే పూర్తయి ఎల్‌పీఎం నంబర్లు వచ్చాయి. ఇపుడు రిజిస్ట్రేషన్‌కు వెళ్తే ఆన్‌లైన్‌లో డేటా లేదని చెప్పారు. అన్ని సక్రమంగా ఉన్నా పట్టా భూములను రీ సర్వే పేరుతో తారుమారు చేశారు. – మారంరెడ్డి సుబ్బారెడ్డి, కుప్పారెడ్డిపాళెం

వివరాలు లేవు

రీ సర్వే జరిగిన 18 గ్రామాల్లోని భూముల ఎల్‌పీ నంబర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దాంతో రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. – సుమలతరెడ్డి, సబ్ రిజిస్ట్రార్, సూళ్లూరుపేట

సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లోని రామచంద్రగుంట, కల్లూరు కండ్రిగ, కారికాడు, మల్లయ్యపాళెం, మైలాంగం, నేలపట్టు, అక్కరపాక, కట్టువపల్లి, పూలతోట, మావిళ్లపాడు, వెంగామాంబపురం, సూళ్లూరు జప్తుకట్టుబడి, అచ్చుకట్ల, దావాదిగుంట, ఆబాక, మినమలమూడి, భీములవారిపాళెం, దేవుని కండ్రిగ రెవెన్యూ గ్రామాల పరిధిలో రి సర్వే జరిగిన తర్వాత నుంచి రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఆలయంలో అన్నదానం



కోట, న్యూస్‌టుడే: కోట పరిధిలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల దాతృత్వంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. ఉభయకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు.

శాప్ ఛైర్మన్ రవినాయుడుకు సన్మానం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: శాప్ ఛైర్మన్ రవినాయుడుని తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంచి కృష్ణయ్య, నాగేంద్రరెడ్డిలు సన్మానించారు. తిరుపతి వెళ్తున్న ఆయన్ను తాళ్వాయపాడులో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సంచి కృష్ణయ్య వైకాపా నేత సత్యనారాయణరెడ్డి కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. వైకాపా తీరు గురువింద సామెతలా ఉందని ఎద్దేవా చేశారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తెదేపా నేతలు

అసంపూర్తి గృహాలు పూర్తి చేయండి

వాకాడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో పక్కాగృహాలు మంజూరై నేటికీ పూర్తి చేయని లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో మనోహర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వాకాడు, కల్లూరు, ముట్టెంబాక, వాలమేడు తదితర గ్రామాల్లో గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోని జగన్న కాలనీలకు వెళ్లి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు, పలు శాఖల అధికారులు, తెదేపా నేతలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చిలోపు పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, మత్స్య శాఖ డీడీ నాగరాజు పేర్కొన్నారు. మన ఇళ్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా తడకండ్రిగ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఈతమాకుల కిరణ్మయి శనివారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయానికి వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రస్తుత ఆర్డీవో చంద్రముని బాధ్యతలు అప్పగించారు. ఆమెను డీఏవో కె.రవికుమార్, తహసీల్దార్ నరసింహారావు, కార్యాలయ ఉద్యోగులు పుష్పం గుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

తిరుమల లడ్డూపై విష ప్రచారం తగదు

నాయుడుపేట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డుపై కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా విష ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. శనివారం ఆయన నాయుడుపేట మండలం తిమ్మాజీకండ్రిగ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకాపా నేతలతో కలిసి పూజలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ కటకం దీపిక, ఏఎంపీ మాజీ ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ● **గూడూరుపట్టణం:** రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ● **వెంకటగిరి:** కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయకుండా తిరుమల లడ్డూను వివాదం చేయడం విడ్డూరంగా ఉందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వరద రాజుల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

తెదేపా సభ్యత్వ నమోదు విరివిగా చేయాలి

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: 2024-25 సంవత్సరానికి తెదేపా సభ్యత్వ నమోదు అధికంగా చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సూచనలు మేరకు నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్.చంద్రముని అంకిత భావంతో విధులు నిర్వహించారని పలువురు ఉద్యోగులు కొనియాడారు. ఆయన బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యాలయ డీఏవో కె.రవికుమార్, తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూముల ఆక్రమణ



మాచవరం వద్ద భూములు చదును చేసిన దృశ్యం

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలో మాచవరం రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 207, 262 లలోని మేత పరంబోకు భూముల్లో కొంత భాగాన్ని స్థానికులు కొందరు నాలుగు రోజులుగా చెట్లు తొలగించి చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈప్రాంతంలోని ప్రభుత్వ మేత పరంబోకు భూములను కొందరు నాయకులు కన్నువేసి ఆక్రమించే ప్రయత్నాలు చేయగా స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు భూముల్లో ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వీటిని లెక్క చేయకుండా కొందరు భూములు ఆక్రమించే ప్రయత్నాల్లో చెట్లు తొలగించి చదును చేస్తున్నారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ పశువుల మేత పరంబోకు భూములు ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

'మట్టి, ఇసుక దోపిడీదారుడికి మాట్లాడే అర్హత లేదు'



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు, పక్కన తెదేపా నేతలు మురళీరెడ్డి తదితరులు

పెళ్లకూరు: అక్రమంగా మట్టి, ఇసుక దోపిడీ చేసిన వైకాపా నేత సత్యనారాయణరెడ్డి తెదేపాపై విమర్శలు చేయడం మానుకోవాలని, ఆయనపై వనరుల దోపిడీ కేసులు పదుల సంఖ్యలో ఉన్నాయని స్వర్ణముఖి ఆనకట్ట మాజీ ఛైర్మన్ పేరం రమేష్‌నాయుడు అన్నారు. పెళ్లకూరు శనివారం మాట్లాడుతూ పొర్లుకట్ట మట్టి దోపిడీ చేసి రూ.2 కోట్లు స్వాహా చేశారన్నారు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీసీసీబీ మేనేజర్ పోస్టులు అమ్ముకున్నది ఎవరని ప్రశ్నించారు. జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మరళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ రోసనూరు, శిరసనంబేడు కొండకు గుండు కొట్టి కేసులు ఎదుర్కొంటోంది ఎవరని ప్రశ్నించారు. దొమ్మరాజు సత్యంరాజు, మునీష్‌కుమార్, హరినాయుడు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణపై అవగాహన

చిల్లకూరు, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కల్గిఉండాలని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మి కోరారు. చిల్లకూరులో ఓ కళాశాలలో శనివారం సునీత సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. జీవనశైలిలో మార్పులు, రసాయనాలు వినియోగించిన కూరగాయలు, పండ్లు తినడం, ఇతర చెడు అలవాట్లవల్ల వ్యాధి భారినపడే ప్రమాదం ఉందన్నారు. సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: జాతర సమయంలో కాంపాళెం ప్రాంతానికి చెందిన చెంచుకుమార్‌పై దాడికి పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని వామపక్ష, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, రమణయ్య, మురళి, రాధాకృష్ణ, గురవయ్య, రవి, చెంగయ్య, బాలకృష్ణ, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



గంగాధర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు

చేనేతల అభ్యున్నతికి కృషి

వెంకటగిరి: చేనేతల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ అన్నారు. శనివారం పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరిస్తానన్నారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ నాగేశ్వరరావు, సునీత, రాజేంద్రకుమార్, వేణు, రామచంద్రయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థినులు



ఎంపికైన గురుకులం విద్యార్థినులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట బిరదవాడ వద్దనున్న గురుకులం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపికల్లో వై.సుధ 800, 1500 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హారిక 100 మీటర్ల పరుగు, సాయితేజశ్విని 400 మీటర్ల పరుగు, లాస్య 4000 మీటర్ల పరుగు, యామిని 100 మీటర్ల పరుగులో ప్రతిభ చూపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రిన్సిపల్ రూత్‌రమోల, అధ్యాపకులు అభినందించారు. ● **వక్తృత్వ పోటీల్లో ప్రతిభ:** గురుకులం పదో తరగతి విద్యార్థిని హరిణి 2047సం వికసిత్ భారత్ సందర్భంగా తిరుచానూరులో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిచూపి తృతీయ బహుమతిని డీఈవో శేఖర్ చేతుల మీదగా శనివారం అందుకున్నారు. అధ్యాపకులు తన్నీరు శశికళ, కృపావతి, సుధలు అభినందించారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల ప్రతినిధులు

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని ఉన్న స్థాయికి చేరుకున్నప్పుడే వారి జీవితం సార్థకత అవుతుందని ఆదిశంకర కళాశాల ప్రిన్సిపల్ వేణుమాధవ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల హ్యాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొని వారిలోని ప్రతిభను చూపడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకి పదును పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు రాజయ్య, అవినాష్, సురేష్, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ప్లాస్టిక్‌పై ర్యాలీ

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాడేట్లు, అధ్యాకులు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేత పట్టి నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని తెలిపారు. తద్వారా వచ్చే కాలుష్యంతో ప్రమాకరమైన వ్యాధులతో అల్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టరు విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి రవీంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయకుమార్‌రాజు, హరికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడేట్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాడేట్లు, అధ్యాపకులు



విద్యార్థులకు హాకీ స్టిక్స్ అందించిన దాతలు

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు తెలిపారు. గూడూరు మండలం విందూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మురళీకృష్ణ దాతృత్వంతో రూ.10వేలు విలువ చేసే హాకీ స్టిక్స్, బాల్స్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా రంగంలో ప్రతి విద్యార్థి రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ కరిముల్లా, ఉపాధ్యాయులు వేణు, జోషఫ్, పుల్లంరాజు, రాజశేఖర్, బాలమురళి, దయాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడుకు చందు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తే విద్యా సంస్థలు ఎదుట ఆందోళనలు చేస్తామన్నారు.

రేబిస్‌పై అప్రమత్తంగా ఉండాలి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులు కరవడం ద్వారా వచ్చే ర్యాబీస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చైతన్య పేర్కొన్నారు. శనివారం దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవద్ద వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. ఇంట్లో పెంచుకునే పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధికి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం మండలం నెల్లబల్లిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న వారిని శనివారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన సర్వే నెంబరు 7లోని మేత పోరంబోకు భూమిని కొందరు చదును చేసి ట్రాక్టర్లతో దున్ని ఆక్రమణకు పాల్పడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న వీఆర్వో రమేష్, వీఆర్‌ఏలు అడ్డుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీనివాసులురెడ్డిపై దాడి

చిల్లకూరు, న్యూస్‌టుడే: బూదనం గ్రామానికి చెందిన తెదేపా నేత మైలాం శ్రీనివాసులురెడ్డిపై అదే ప్రాంతవాసులు శనివారం దాడికి పాల్పడ్డారు. గ్రామంలో దారి విషయమై కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో పంచాయతీలో గ్రామసభ నిర్వహణ సమయంలో మాటా మాటా పెరగడంతో గ్రామానికి చెందిన భాస్కర్, వీరయ్య, వెంకటకృష్ణయ్య, విష్ణు, భారతి, హేమంత్, లక్ష్మమ్మ దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు శెట్టిగారిబీటు ప్రాంతలో ఈ నెల 24వ తేదీన ఆనందమ్మను హత్య చేసిన నిందితుడు పాలెపు రమేష్‌ని అరెస్ట్ చేసినట్లు సీఐ కిషోర్‌బాబు తెలిపారు. గూడూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శనివారం నింధితుడి వివరాలు వెల్లడించారు. ఆనందమ్మతో రమేష్ చెన్నూరులో కొన్నేళ్లుగా సహజీవనం సాగించేవారు. ఈ క్రమంలో ఆనందమ్మకు మరొక వ్యక్తితో అక్రమ సంబంధం ఉందనే అనుమానం పెంచుకున్న రమేష్ ఆనందమ్మ నిద్రిస్తున్న సమయంలో కర్రతో బలంగా కొట్టగా అక్కడిక్కడికే మృతి చెందిందన్నారు. దీంతో హత్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తిప్పవరపాడు క్రాస్ రోడ్డు వద్ద రమేష్‌ను శనివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్సై మనోజ్‌కుమార్, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట రజక కాలనీలోని కల్యాణ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు చదలవాడ మోహన్‌కృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చందనాలంకారంలో వేంకటేశ్వరుడు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో పెరటాశి నెల రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు కస్తూరి చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

జలాశయాలకు తాగునీటి పథకాల అనుసంధానం

- మళ్లీ తెరపైకి వాటర్ గ్రిడ్ పనులు
- ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా



కండలేరు-పూండి కాలువ

గూడూరు, న్యూస్‌టుడే: పల్లెలకు సురక్షిత తాగునీటిని అందించే వాటర్ గ్రిడ్ పనుల వైపు రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని వైకాపా పక్కన పెట్టేయడం.. ఫలితాలు ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా సమీక్షలో నీటి పథకాలు జలాశయాలకు అనుసంధానించే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు నదులు, సర్వీసు రిజర్వాయర్‌లను పైపులైన్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంది. ఇదే తీరుగా సంపులు, చెరువులు నీటితో నింపే పథకాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఏటా పల్లెలకు నిత్యం నీటిని అందించే అవకాశం కలుగుతుంది. చిత్తూరు జిల్లాలో 3.53 లక్షలు, తిరుపతి జిల్లాలో 3.85 లక్షల గృహాలున్నాయి. ఇవన్నీ పల్లె ప్రాంతాలు కాగా నేరుగా నీటి సరఫరా చేసే పథకాలు ఎక్కువగా ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్‌లో పెద్దఎత్తున నిధులు వచ్చినా కుళాయి కనెక్షన్ల పేరిట రూ. కోట్ల వ్యయం చేసింది వైకాపా సర్కార్. ఉన్న పథకాలు నీటి వనరులు లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. నీటి వనరులు అందుబాటులో లేకుండానే వైకాపా ప్రభుత్వం ఇంటింటికి కుళాయిలు ఇచ్చింది. ఇవి చాలా చోట్ల మొక్కుబడి కాగా వాటిని సరిచేసే ప్రక్రియ తాగునీటి సరఫరా శాఖ చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ తాగునీటి పథకాలు

వివరాలు	తిరుపతి	చిత్తూరు
కాలనీలు	4,008	5,310
గృహాలు	3,85,684	3,53,147
నీటి కనెక్షన్లు	2,67,788	2,96,306
సీపీడబ్ల్యూఎస్	24	02
ఎంపీడబ్ల్యూఎస్	2,155	960
డైరెక్ట్	2,672	1,718
చేతిబోర్లు	34,958	29,516

కండలేరు నీటిని తెచ్చే ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లాలోని పల్లెలకు కండలేరు నీటిని తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇలా ఆ నీటిని జలాశయాలు, చెరువుల్లో నింపి అక్కడి నుంచి ఓహెచ్ఆర్‌లకు నీటిని అందించే ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాలకు సుమారుగా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేయాల్సి ఉంది.

■ చిత్తూరు జిల్లాలో విజయపురం, నింద్ర మినహా ఎక్కడా సమగ్ర రక్షిత నీటి పథకాలు అందుబాటులో లేవు. ఆయా ప్రాంతాల్లో సురక్షిత నీటిని అందించే ప్రణాళిక గ్రామీణ తాగునీటి శాఖ చేపడుతోంది. చిత్తూరు పడమర ప్రాంతాల్లో రూ.2,665 కోట్ల అంచనాలతో చేపట్టిన పథకం ముందుకు కదల్లేదు. కాగా గతంలో తిరుపతి జిల్లాకు ఏమీ కేటాయించక పోగా.. ప్రస్తుతం రూ.2,400 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఇలా రెండు జిల్లాల్లో నీటి పథకాలకు అంచనాలు చేస్తున్నారు.


అంచనాలు సిద్ధం చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. అంచనాలు చేపట్టి పథక రచన చేయాల్సి ఉంది.

– విజయకుమార్, ఎస్ఈ, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, తిరుపతి

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు క్షత్రియ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి క్షత్రియ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (29 సెప్టెంబరు 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91547 72006 & 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

ఏఓఎంఎస్ఐ సభ్యుడిగా ధరణి చౌదరి



తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మ్యాక్సిల్లో ఫెషల్ సర్జన్ ఆఫ్ ఇండియా(ఏఓఎంఎస్ఐ) ఈసీ మెంబరుగా తిరుపతికి చెందిన ప్రముఖ ఓరల్ అండ్ మ్యాక్సిల్లో ఫెషల్ సర్జన్ డాక్టర్ కిలారి ధరణి చౌదరి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరుగుతున్న 16వ రాష్ట్ర సదస్సులో ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో జరిగే 49వ జాతీయ సదస్సుకు నిర్వహణ సభ్యులుగా నియమించారు.

'సిట్‌తో చంద్రబాబు లబ్ధిపొందాలని చూస్తున్నారు'



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి, మేయర్ శిరీష, వైకాపా నాయకులు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై వచ్చిన ఆరోపణలను తాము సీబీఐ విచారణ జరిపించాలని కోరితే, సీఎం చంద్రబాబు మాత్రం తాను కూర్చోమంటే కూర్చునే సిట్‌తో దర్యాప్తు జరిపించి, లబ్ధి పొందేందుకు చూస్తున్నారని తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. వైకాపా రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నగరంలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శనివారం ఆయనతోపాటు వైకాపా శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తితిదే అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, తెలుగుదేశం బంటుల్లా, చంద్రబాబు ఏజెంటుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోజా కోసం ఏడెనిమిది వందల మంది ఇతర మతస్థులు దర్శనానికి వస్తారని, వారి వద్ద ఎలాంటి డిక్లరేషన్లు అడగలేదని, కేవలం జగన్ వద్దనే అడిగారని విమర్శించారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జూపార్కు మార్గంలో అనధికార దుకాణాలు

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి నుంచి జూపార్కుకు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల అనధికారికంగా దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పెరగడం, అరవింద్ ఐ ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆసుపత్రులు, జూపార్కు, సైన్స్ సెంటర్‌కు జనం పెద్దఎత్తున వస్తున్న నేపథ్యంలో వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి. ఇన్నాళ్లు తాత్కాలికంగా తోపుడు బండ్లు, వాహనాలపై వ్యాపారం చేసినవారు ఇప్పుడు శాశ్వతంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సైన్స్ సెంటర్ నుంచి టాటా క్యాన్సర్ ఆసుపత్రి వరకు రోడ్డుకు రెండు వైపులా షెడ్లు, పాకలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటి వెనుక కొందరు నేతలు, అటవీశాఖ అధికారులు ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వారి నుంచి కొంత నగదు వసూలు చేసి, దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్టు తెలిసింది.



అరవింద్ ఐ ఆసుపత్రికి ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణం



పుస్తకావిష్కరణలో ఆచార్య రాణి సదాశివమూర్తి తదితరులు

'రంగ వీక్షణం' పుస్తకావిష్కరణ

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఆకాశవాణి విశ్రాంత అధికారి ఆకెళ్ల మల్లేశ్వరరావు రచించిన 'రంగ వీక్షణం' వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభ శనివారం ఓ ప్రైవేటు హోటల్లో జరిగింది. ఎస్వీ వేద విశ్వవిద్యాలయ వీసీ రాణిసదాశివమూర్తి మాట్లాడుతూ.. మల్లేశ్వరరావు కథలు, నవలలు, పాటలు, నాటకాలు ఇలా అన్ని రంగాల్లోనూ వ్యాసాలు వెలువరించారన్నారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, బీఎన్‌రెడ్డి, రాఘవాచారి, గరికపాటి రమేష్ బాబు, శతావధాని ఆముదాల మురళి, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు కిషోర్, వేదికపై టీజీ వెంకటేష్, నాయకులు

ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య సంఘం తిరుపతి జిల్లా గ్రామీణ అధ్యక్షుడిగా ఎంపికైన గూడూరు కిషోర్ కుమార్ శనివారం ఆర్య వైశ్య సం ఘం నాయకులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. వీరి వెంటి ప్రధాన కార్యదర్శి గాధంశెట్టి నాగరాజు, కోశాధికారిగా పత్తిపాటి తులసి కృష్ణ, మహిళా అధ్యక్షురాలు కాకుమాని సావిత్రి, మహిళా ప్రధాన కార్యదర్శిగా గుంపర్ల ప్రభావతి, కోశాధికారిగా పోకూరు అరుణమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు టి.జి. వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సంఘటితంగా వ్యవహరించడం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం నేతలు షణ్ముఖరావు, శ్రీనివాస్, నరసింహులుశెట్టి లక్ష్మయ్య, నాయుడుపేట పట్టణ నాయకులు పాలొన్నారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ బదిలీ

జీవకోన(తిరుపతి): ఏపీ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా ఇటీవల బదిలీపై వచ్చిన మురళీధర్ మళ్లీ అనంతపురం పోలీసు శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శనివారం ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆయన్ను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195



మంగళసూత్రం చూపుతున్న వేదపండితులు

వేడుకగా శ్రీనివాస కల్యాణం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నామని రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక రాస్ పద్మావతీ ప్రార్థనా మహిళా మండలి వద్ద శనివారం శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. నిరుపేదలకు ట్రై సైకిళ్లు, చేతికర్రలు, దుప్పట్లు, వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, రాస్ పొదుపు సంఘాల సంచాలకుడు నాగరాజు, సిబ్బంది రాణి, నాగరాజు, లీలాకుమారి, క్లస్టర్ లీడర్లు నగీన, విజయమ్మ, శారద, ముంతాజ్, హసీనా, 350 మహిళలు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత దేశంతోనే ఆరోగ్యకర సమాజం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: మాదక ద్రవ్య రహిత దేశంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. స్విమ్స్‌లో మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆర్గనైజింగ్ సభ్యులు కవిత, సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో వైద్యులు

ఊకా విజయకుమార్‌కు సత్కారం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన ఊకా విజయకుమార్‌ను తెదేపా నాయకులు సత్కరించారు. స్థానిక నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన్ని సత్కరించిన వారిలో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, నాయకులు జేబీ శ్రీనివాస్, బెల్లంకొండ సురేష్, రఘు, ఆముదాల వెంకటకృష్ణ, కష్ణమూర్తి, శేషాద్రి మునికృష్ణ, మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



ఊకా విజయకుమార్‌ను సత్కరిస్తున్న జేబీ శ్రీనివాస్ తదితరులు

దమ్మయాత్ర విజయవంతం చేయండి

తిరుపతి(భవానీనగర్): ఈ నెల 21న కేరళలో ప్రారంభమైన అశోక-అంబేడ్కర్ దమ్మయాత్ర ఈ నెల 30న తిరుపతికి చేరుతుందని, ఈ యాత్రను విజయవంతం చేయాలని అంబేడ్కర్ భవన్ నాయకులు పరమశివం విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన యాత్ర వివరాలను వెల్లడించారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: యర్రావారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం కోర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కల్పించారు. కోర్ సంస్థ ప్రతినిధి తులసి, ఎంఈవో-2 సతీష్, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి పాల్గొన్నారు.

బృహత్తర దారులకు అప్పుడే మరమ్మతులు

అక్రమ పంచాయతీ తేలకనే వెలుగులోకి అవినీతి బాగోతం



ఇది తిరుపతి నగరం నడిబొడ్డున ఉన్న తాతయ్యగుంట ఆలయం- బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం మధ్య నగరపాలక సంస్థ అధికారులు నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు. వాస్తవానికి ఇందులో కొంతభాగం మాత్రమే మాస్టర్‌ప్లాన్ రోడ్డు కాగా.. మిగిలిన భాగాన్ని దౌర్జన్యంగా ఇళ్లను కూల్చి అధికారులు రాత్రికి రాత్రి ఈ రోడ్డును నిర్మించారు. ఇప్పటి వరకు 42 మందిలో 7 మందికి మాత్రమే పరిహారం టి.డి.ఆర్ బాండ్ల రూపంలో లభించింది. మిగిలిన వారికి పరిహారం వస్తుందో.. రాదో తెలియని పరిస్థితి. దాదాపుగా 90 శాతం మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇంత హంగామా చేసి నిర్మించిన రోడ్డు నాణ్యత చాలా దయనీయంగా ఉంది.

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: గతంలో ఉన్న రోడ్డు ప్రాంతం మినహా కొత్తగా విస్తరణ జరిగి రోడ్డంతా ఎక్కడికక్కడ కుంగిపోతూ మాస్టర్‌ప్లాన్ రోడ్ల నాణ్యతకు మచ్చుతునకగా నిలిచింది. వాస్తవానికి గంగజాతర సందర్భంగా ఏడాదిన్నర క్రితం రాత్రికి రాత్రి రోడ్డు నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, మాస్టర్‌ప్లాన్ రోడ్డు రాజకీయ నేతల కమిటీ పట్టుబట్టి రోడ్డును నిర్మించింది. అప్పట్లో ఇసుక స్థానంలో రాతిపొడిని వాడి రోడ్లను నాసిరకంగా నిర్మించారు. తిరుపతి వాసుల నుంచి వ్యతిరేకత లభించినా.. నేతలు భరోసా కల్పించి ఈ రోడ్డును దయనీయంగా నిర్మించేలా చేశారు.

అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదాలు తప్పవా?

ఈ రోడ్డు నిర్మాణంలో సిమెంట్ పనులకు సంబంధించి ఇసుక వినియోగాన్ని పూర్తిగా నిలిపివేశారు. రాతిపొడితో రోడ్డుకు అనుసంధానంగా కాలువల్ని నిర్మించారు. పనుల నాణ్యత ఏమాత్రం అనుమతించని విధంగా ఉంటుందని అంటున్నారు. ఈ కాలువ పైకప్పును తారుతో మూసివేయడంతో భారీ వాహనాలు దానిని రోడ్డుగా భావించి కాలువపై ప్రయాణించే అవకాశం ఉంది. నాణ్యత లేని పైకప్పులు ఉన్న ప్రాంతాన్ని తారుతో కప్పి రోడ్డు వెడల్పును పెంచాలనే దురాలోచనతో అధికారులు చేసిన తప్పిదం ఎన్ని ప్రమాదాల్ని తెచ్చిపెడుతుందో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. హెడ్‌పోస్టాఫీస్ కూడలి నుంచి గంగమ్మ ఆలయం వరకు ఉన్న మ్యాన్‌హోల్స్ ఇప్పటికే దెబ్బతినడంతో వాటిని మార్చాల్సి వచ్చింది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఈ రోడ్డులో మరమ్మతు పనులు చేయడం ద్వారా పనుల నాణ్యతను అంచనా వేయవచ్చు.



గ్రూప్ థియేటర్స్ సమీపంలో పనులు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: సర్దార్ భగత్‌సింగ్ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ యూనివర్సిటీ ఎస్‌జీఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ● ఏపీ స్టూడెంట్స్ ఐకాస ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూ సెనేట్ హాల్లో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, ఎస్వీయూ వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు, జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. తిరుపతి(నేరవిభాగం): భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో 20 మంది యువసేన నాయకులు శనివారం రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మునిదీప్, నూతన ప్రసాద్, శ్రీకాంత్, ఎల్‌కే నాయుడు, లలిత్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు. **తిరుపతి(నగరం):** మహిళలకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు అన్నారు. శనివారం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, ఉదయ్ కుమార్, రామకృష్ణ, కాళయ్య, ప్రీతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమాభివృద్ధే లక్ష్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమాభివృద్ధే నరశింగాపురం రైతు సేవా సహకారసంఘం లక్ష్యమని సింగిల్‌విండో మేనేజింగ్ డైరెక్టర్ యం.భాస్కర్‌రెడ్డి అన్నారు. సహకారసంఘం కార్యాలయ ఆవరణలో శనివారం మహాజన సమావేశం నిర్వహించారు.

పంచాయతీ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యలయ ఆవరణలో శనివారం సర్పంచి ముదికుప్పం రూపారామ్మూర్తి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు, శ్మశానవాటికకు హద్దులు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పంచాయతీ అధికారులు నివేదికలు రూపొందించారు.

కానిస్టేబుల్ నుంచి రక్షణ కల్పించండి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: కానిస్టేబుల్ ఏలుమలై రెడ్డి నుంచి రక్షణ కల్పించాలని అతని భార్య ఉష శనివారం ప్రెస్‌క్లబ్‌లో వాపోయారు. కొన్ని రోజులుగా విడాకులు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని తెలిపింది.



తిరుచ్చిపై శ్రీహరి విహారం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు శనివారం దేవేరులతో బంగారు తిరుచ్చివాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెరటాసిమాసం రెండో శనివారం సందర్భంగా ఆలయ ముఖమండపం, ధ్వజ మండపం, ప్రధాన బలిపీఠం ప్రాంతాల వద్ద మహిళలు పిండి దీపారాధన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీహరి ఆర్జిత కల్యాణ మహోత్సవం జరిపారు.

'హే సిరి అలా వెళ్లకే' ట్రైలర్ విడుదల

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: 'హే సిరి అలా వెళ్లకే' వెబ్ సీరిస్ ట్రైలర్‌ను శనివారం ప్రెస్‌క్లబ్‌లో చిత్ర యూనిట్ సభ్యులు విడుదల చేశారు. నిర్మాత షీలా లోకనాథమ్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్వాన వేడుకలు

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ శనివారం ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, ఇంజినీరింగ్ కళాశాల సంచాలకులు మల్లికార్జున పాల్గొన్నారు. **మంగళం(తిరుపతి):** మంగళం సమీపంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ మన్నెంరామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాషువా జయంతి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: సమాజంలోని అసమానతలు తొలగించడం కోసం సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని కవిత్వాన్ని సృష్టించిన మహాకవి గుర్రం జాషువా అని ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన కేంద్రం డైరెక్టర్ పీసీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాషువా జయంతిని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థులు


పాకాల, న్యూస్‌టుడే: ఓబులశెట్టివారిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి సమీర రాష్ట్ర స్థాయి అండర్-17 విభాగం డిస్కస్‌త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సి.కుమార్‌రెడ్డి, పీఈటీ నిరంజన్ కుమార్ తెలిపారు. ఈ నెల 26న చిత్తూరులో జరిగిన పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర పోటీల్లో చోటు దక్కించుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో చంద్రగిరిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 15 మంది మంది విద్యార్థులు రాణించారని, జిల్లా స్థాయిలోనూ ప్రతిభ చూపారని వివరించారు. పాఠశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ర్యాంకింగ్ మెరుగుకు సూచనలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ఉన్నత ర్యాంకు పొందేందుకు తగు సూచనలు సలహాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కమిటీ సూచించింది. ఎస్వీయూ గత ఏడాది వరకు 60వ ర్యాంక్‌లో కొనసాగింది. ప్రస్తుతం 87వ ర్యాంకులో ఉంది. ఈ స్థానాన్ని అధిగమించి 50వ ర్యాంకును పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆ కమిటీ సూచనలు చేసింది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



వీసీ, రిజిస్ట్రార్‌లతో సమావేశమైన కమిటీ సభ్యులు

పుల్లావాండ్లపల్లి పరిసరాల్లో ఏనుగుల విధ్వంసం

పాకాల, న్యూస్‌టుడే: పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లి పరిసరాల్లో శుక్రవారం రాత్రి అడవి ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. గ్రామానికి చెందిన తమ్మన్నగారి రామచంద్ర, శ్రీరాములు, మజ్జిగ రామకృష్ణ, యనమల నరసింహులు తదితరుల వరి పొలాలను పనికిరాకుండా తొక్కేశాయి. వంగ తోటలకు నష్టం కలిగించడంతో పాటు మామిడి చెట్లను విరిచేశాయి. అసలే గిట్టుబాటు ధరల్లేని కాలంలో అప్పులు చేసి సాగు చేసిన పంటలను ఏనుగులు నాశనం చేశాయని, రెండేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు.



ధ్వంసమైన పొలాన్ని చూపుతున్న రైతు